# మీరెవరో మీకు తెలుసా......?



ఆలోచించండి

# మీరెవరో మీకు తెలుసా ?

డా. కె. రామారావు

శ్రీ రమణక్షేత్రం

జిన్నూరు

మీరెవరో మీకు తెలుసా ?

మూడవ ముద్రణ:
నవంబర్. 1993

సర్వహక్కులు
శ్రీ రమణ క్షేత్రము
జిన్నూరు - 534 265
ఆంధ్రప్రదేశ్

సలహా సంప్రదింపులకు:
శ్రీ సాగిరాజు రామచంద్రరాజు
వడ్లవానిపాలెం పోస్ట్
(వయా) జిన్నూరు - 534 265
ఫోన్: 2638 (పాలకొల్లు)

ముద్రణ:
రత్నప్రింటింగ్ వర్క్స్
పాలకొల్లు. ఫోన్: 08814-2946

వెల: రు. 8-00

# నా విన్నపం వింటారా ?

"గురుర్ర్బహ్మ గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురువేన్నమః"

దేహమునకు జన్మనిచ్చిన తల్లి ఋణము తీర్చుకోవచ్చును. తండ్రి ఋణము తీర్చుకోవచ్చును. బడిలో పాఠాలు నేర్పిన గురువు ఋణము తీర్చుకోవచ్చును - కాని స్వరూపమును మనకు పట్టిచూపే గురువు ఋణము మాత్రము తీర్చుకోలేము. అట్టి నా గురుదేవులు శ్రీ నాన్నగారి పాదపద్మములకు ప్రణమిల్లి. మీరెవరో మీకు తెలియ చెప్పుటకు శ్రీకారము చుట్టుతున్నాను.

మనస్సుఅనే మాయ పొరను చీల్చుకుని. అహంకారమనే గూటిలోనుంచి బయటపడలేక. అజ్ఞానముతో మమకారమును పెంచుకుని. మరణించిన వారికోసము దుఃఖముతో కుమిలిపోతున్న మాతృమూర్తుల కన్నీటిని చూడలేక - మీరెవరో మీకు తెలియచెప్పి. కనీసము ఒక్క కన్నతల్లి కన్నీటి తడినైన తుడిచి. మిమ్ములను దుఃఖస్పర్శలేని సుఖ జీవితములోనికి నడిపించాలనే కాంక్షతో - శ్రీ నాన్నగారి అమృత వాక్కులలోని కొన్ని నగ్న సత్యాలను ఆధారము చేసుకుని. మీ జీవిత అనుభవాలను జోడించి. మీ బుద్ధికి కొంత మేతనిస్తున్నాను.

హితవు కోరి చెప్పే మాటలు ఎప్పుడూ మితముగా ఉండాలి మృదువుగా ఉండాలి. కాని నామాటలు శృతిమించి. మిమ్ములను నొప్పిస్తే - నన్ను క్షమించమని ప్రార్థిస్తున్నాను.

ప్రతీయింటికి చావువచ్చి ఏదో ఒకరోజున తలుపు తడుతుంది.

అది నాఇంటికి రాకముందే నేను చావుచేతిలోనుంచి బయటపడాలనే తపనతో ఎక్కడెక్కడో తిరిగాను. ఎందరెందరనో ఆశ్రయించాను - చివరకు వచ్చి శ్రీ నాన్నగారి పాదాల చెంత చేరాను. ఆ తండ్రి చూపులలోని శాంతి, మాటలలోని మమత, చేతలలోని సమత నా గుండెను కుదిపివేశాయి - నా జీవిత గమనాన్నే మార్చివేశాయి - నేను శాంతి శిఖరాలను చేరుకోవడానికి నాబ్రతుకుకు ఒక నూతన బాటను వేశాయి - నాలో ఎంతో వెలుగును నింపాయి - నా దుఃఖాన్ని ఆర్పి వేశాయి.

దేవుడు 'ఉన్నాడో - లేడో' అదిమన అనుభవములోలేదు. కాని మనదేహము, మనమనస్సు మన అనుభవములో ఉన్నవి. లోకములోని అన్ని సమస్యలకు - ఇవిరెండే కారణములు. మనకు దుఃఖము వచ్చినా, కష్టం వచ్చినా, నష్టం వచ్చినా, కామం వచ్చినా, క్రోధం వచ్చినా, లోభం వచ్చినా - అన్నిటికీ ఈదేహము, మనస్సే కారణము. మెలుకువలోను, స్వప్నములోను కూడ ఈ దేహము, మనస్సు మనల్ని సుఖముగా, శాంతిగా ఉంచుటలేదు. గాఢనిద్రలో మనకు దేహంగొడవగాని, మనస్సు గొడవగాని లేవు - అప్పుడు లోకంగొడవ, దేవునిగొడవ కూడా లేవు - కాని మనము మాత్రము సుఖముగా ఉన్నాము. అందుకే అందరూ నిద్రను కోరుకుంటున్నారు. ఇదంతా మన అనుభవములో ఉన్నవిషయమే! దీనిని కాదనగలవారు ఎవరైనా ఉన్నారా?

దేహ భావనకు, మనస్సునకు - 'నేను' అనుతలంపే ఆధారము. ఈ 'నేను' అనుతలంపే అహంకారము. అహంకారము ఉంటే అంతా ఉంది - అహంకారముపోతే ఏమీలేదు. గాఢనిద్రలో ఈ 'నేను' అను తలంపు లేదు. అప్పుడు మనకు దేహం గొడవగాని,

మనస్సు గొడవగాని లేవు - దానికి మననిద్రే సాక్షి! ఈ 'నేను' లోనుంచి విడిదలపొందకుండా - నేను దేవుడు ఉన్నాడనిచెప్పినా- మీరు దేవుడు లేడని చెప్పినా - ఒక్కటే అవన్నీ అనుభవంలేని, అర్థంలేని వట్టి మాటలు! మనము దుఃఖముతో కుమిలిపోతున్నప్పుడు ఈ వట్టి మాటలవలన ప్రయోజనం ఏమిటి? మనము దుఃఖములోనుంచి బయటపడాలంటే:- మనము అంటున్న ఈ 'నేను' నుంచి విడుదల పొందాలి. ఈ 'నేను' నుంచి విడుదల పొందాలంటే-ఈ'నేను' పుట్టినచోటు మనము తెలుసుకొని తీరాలి - దానికి మరో మార్గములేదు. మరి ఏమిటా 'నేను' పుట్టిన చోటు?

## ఆత్మ!

మీకు ఆధారముగా ఉన్నది, నాకు ఆధారముగా ఉన్నది, ఈ సృష్టికి ఆధారముగా ఉన్నది, మనము పూజించే దేవతలకు ఆధారముగా ఉన్నది - సత్యము ఒక్కటే బ్రహ్మము ఒక్కటే అదే ఆత్మ! ఆ ఆత్మ అనంతము, అఖండము, అవ్యయము, అజరము, అభౌతికము,అలౌకికము, అద్వితీయము, అనిర్వచనీయము. అది సత్‌చిత్ ఆనంద స్వరూపము. ఆ ఆత్మనే కొందరు'దేవుడని', 'ఈశ్వరుడని' అంటారు. ఎవరు ఏ పేరుతో పిలిచినా - ఉన్న పరబ్రహ్మస్వరూపము మాత్రము ఒక్కటే. అది ఎక్కడో మనకు దూరానలేదు - మన స్వరూపముగానేఉంది - మన హృదయములోనే ఉంది - మనకంటే వేరుగాలేదు.

ఆత్మ సుఖస్వరూపము - అందుకే అందరూ సుఖాన్నే కోరుకుంటాము - దుఃఖాన్ని ఏజీవుడు కోరుకోడు. ఆత్మ శాంతిస్వరూపము - అందుకే అందరు శాంతినే కోరుకుంటాము - అశాంతిని ఏజీవుడుకోరుకోడు - ఆత్మ ప్రేమ స్వరూపము - అందుకే అందరు ప్రేమను కోరుకుంటాము. ఆత్మ అందమైనది అందుకే అందరు అందాన్ని కోరుకుంటాము. ఆత్మ స్వతంత్రమైనది - అందుకే అందరు స్వేచ్ఛను కోరుకుంటాము. ఆత్మ అమృత స్వరూపము - అందుకే అందరు జీవించాలనే కోరుకుంటాము - మరణించాలని ఏ జీవుడూ కోరుకోడు.

"నేను" ఆత్మ - "నేను" అను తలంపు అహంకారము. ఆత్మ అనంతమైనది - అహంకారము పరిమితమైనది. ఆత్మ సముద్రమైతే - అహంకారము బుడగ వంటిది. బుడగలేకుండా సముద్రము ఉండగలదుగాని - సముద్రము లేకుండా బుడగ ఉండలేదు. అదే విధముగా అహంకారము లేకుండా ఆత్మ ఉండగలదుగాని - ఆత్మ లేకుండా అహంకారము ఉండలేదు. అహంకారానికి దేహం కావాలి, లోకం కావాలి, దేవుడు కావాలి. కాని దేహం లేకుండా,లోకంలేకుండా, దేవుడులేకుండా ఆత్మ ఉండగలదు - అది స్వయంప్రకాశము. దానిని నీరు తడుపలేదు - నిప్పు కాల్చలేదు- గాలి కదుపలేదు. దానికి పుట్టుకలేదు - మరణములేదు. దానికి ఆదీలేదు - అంతమూలేదు. సినిమా బొమ్మలకు తెర ఎలా ఆధారమో - అదేవిధముగా ఈ సృష్టికి ఆత్మే ఆధారము. అట్టి ఆత్మ నిరంతరము మన హృదయములో స్వయముగా ప్రకాశిస్తున్నప్పటికి - మబ్బు సూర్యుణ్ణి మూసినట్లు - అహంకారమనే మబ్బు ఆత్మ మన అనుభవములోనికి రాకుండా

అడ్డుపడుతున్నది.

అహంకారమే దేహాత్మభావనకు కారణము. దేహాత్మభావనే అజ్ఞానము. తాను దేహమాత్రుడనని అనుకున్నంత కాలము ఏ జీవుడిని అహంకారము విడిచి పెట్టదు. అహంకారము ఉన్నంత కాలము వేరుభావన విడిచిపెట్టదు. వేరుభావన ఉన్నంతకాలము ఆశ విడిచిపెట్టదు. ఆశ ఉన్నంతకాలము మనిషి పాపముచేసి తీరతాడు. ఆ పాపమే దుఃఖముగా పరిణమిస్తున్నది.

అహంకారము ఉన్న మనిషి కర్తృత్వమును విడిచిపెట్టి పనిచేయలేడు. కర్తృత్వము ఉన్నంతకాలము ద్వంద్వాలు విడిచిపెట్టవు. దేహము ఉన్నంతకాలము బట్టలు ఎలా వేసుకుంటామో - అహంకారము ఉన్నంతకాలము దేహము వచ్చి తీరుతుంది. దేహము వచ్చినదంటే దుఃఖము తప్పదు.

అహంకారము లేకుండా జీవించుటకంటే మించిన తపస్సులేదు. ఎవడైతే తన అహంకారాన్ని శిలువవేస్తాడో - వాడికి మాత్రమే సత్యము తెలియబడుతుంది; స్వరూపము దర్శనమిస్తుంది. దుఃఖము విడిచి పెడుతుంది.

కాని ఆత్మను దర్శించేవరకు ఏ జీవుడినీ అహంకారము విడిచిపెట్టదు. అహంకారాన్ని విడిచి పెట్టకుండా ఏ జీవుడు జ్ఞానికాలేడు. జ్ఞాని కానివాడు దేవునిలో లయముకాలేడు. తాను దేహమాత్రుడనని అజ్ఞాని ఎంత సహజముగా అనుకుంటాడో - తాను ఆత్మ స్వరూపుడనని జ్ఞాని అంత సహజముగా అనుకుంటాడు. జ్ఞానిది శివదృష్టి - అజ్ఞానిది శవదృష్టి. కనుక జ్ఞానికి దేహముతో పనిలేదు. వాడికి దేహము ఉన్నా - ఊడినా ఒక్కటే

అహంకారము ఉన్నవాడికి దేహము కావాలిగాని - అహంకారమే లేనివాడికి దేహముతో పనేముంది? దేహమున్నవాడికి మరణము - దేహమే లేనివాడికి మరణమేమిటి?

కాని మనమందరము మరణము అంటే భయపడుతున్నాము - ఎందుచేత? మనము కానిదేహాన్ని మనమని భ్రమపడుతున్నాము. 'దేహమే నేను' అని మనము అనుకుంటున్నంతకాలము - ఏజన్మకాజన్మ మనము మరణిస్తునే ఉంటాము.

తనువు తానుకాదని తెలిసిన వాడికి చావు చాలా స్వల్పవిషయము. ఈ రోజు పగటికి, రేపు పగటికి మధ్యన రాత్రి పోయేనిద్ర ఎటువంటిదో - ఈజన్మకు, రాబోవు జన్మకు మధ్యన చావుకూడా అటువంటిదే! మరి రాత్రిపూట నిద్రపోవడానికి మనమెవరైనా భయపడుతున్నామా? నిద్రంటే ఎటువంటిదో - చావుకూడా అటువంటిదే! మరణమనేది ఒక దీర్ఘనిద్ర - అంతే! జీవితములో ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయి - అలాగే మరణమనేది కూడ ఒక సంఘటన మాత్రమే - కాకపోతే అది జీవితములో చివరి సంఘటన - అంతే! మీరు మరణాన్ని చూసి భయపడకండి.

మరణమనేది కూడ ఒక తలంపే! మనకు ఎన్నో తలంపులు వస్తున్నాయి - ఆ తలంపుల మూటే మనస్సు! మనస్సును మింగినవాడికి మరణమేలేదు. మీ మనస్సును మీరు మింగండి - మరణాన్ని మీరు అతిక్రమించండి.

మనస్సుకు, ప్రాణమునకు మూలము ఒక్కటే ఆత్మ! ప్రాణము నిరోధించుట వలన మనస్సుకూడ నిగ్రహించబడుతుంది - అందుకే

ప్రాణాయామము చెప్పారు మన పెద్దలు. కాని ప్రాణాయామము వలన మనస్సు అణుగుతుందేగాని - మనస్సు నశించదు. అణిగిన మనస్సు మరల తిరిగి విజృంభించకమానదు. మనస్సు నశించేవరకు మాయ విడిచిపెట్టదు.

'మనస్సును నిగ్రహించుట కష్టమే! అయినప్పటికి అభ్యాసముతో. వైరాగ్యముతో మనస్సును స్వాధీనము చేసుకోవచ్చును' అని భగవద్గీతలో గీతాచార్యుడు బోధించాడు.

'అసలు మనస్సు అనేది ఉందేమో ముందు దానిని అన్వేషించు - ఉంటే నిగ్రహించుకుందువుగాని! మీరు ఎప్పుడైతే మనస్సును అన్వేషించడం ప్రారంభించారో - ఆ అన్వేషణలో జన్మ జన్మల నుంచి మీతో వస్తున్న సంస్కారములు ఒక్కొక్కటి మీకు తెలియకుండానే కాలిపోయి. రాలిపోతాయి. అప్పుడు అసలు మనస్సు అనేదే లేదని మీకు తెలుస్తుంది! లేని మనస్సును నిగ్రహించుట ఏమిటి?' అని అంటున్నారు శ్రీ రమణాచార్యుడు.

'ఈ నిగ్రహించుకోవటాలు. అన్వేషించటాలు గొడవ నీకెందుకు? నీవు ఆత్మవు - మనస్సువు కాదు. నీవు కాని మనస్సు గొడవ నీకెందుకు? అసలు దానిని పట్టించుకోకు - దానిని ఖాతరుచేయకు. నీవు నీవుగా ఉండు - సరిపోతుంది - సాధనలతో పనేలేదు' అని అంటున్నారు శ్రీ నాన్నగారు.

మీకు శక్తి ఉంటే సాధనచేసి. మీ మనస్సును మీరు సంస్కరించుకొని. సత్యాన్ని తెలుసుకోండి. మీకు సాధనచేసే ఓపిక లేకపోతే - కనీసము ఒక సత్పురుషునితో సహవాసము చేయండి. సత్పురుష సహవాసము వలన సమస్త సద్గుణాలు మీకు

సమకురతాయి. మల్లెపూల సన్నిధిలో పరిమళము ఎంతసహజమో - సత్పురుమల సన్నిధిలోశాంతి, శక్తి, కాంతి అంత సహజము. సత్పురుష సహవాసమువలన మీ ప్రయత్నములతో నిమిత్తము లేకుండానే అప్రయత్నముగా మీ తలంపులు రాలిపోతాయి. మీ మనస్సు శాంతి సముద్రములో, కాంతి సముద్రములో, సుఖ సముద్రములో, జ్ఞాన సముద్రములో కూరుకుపోతుంది. సత్పురుష సహవాసమును మించిన సాధనగాని - సంపదగానిలేదు. 'సత్పురుష సహవాసము కొరకు అవసరమైతే ప్రపంచపు అంచులవరకైనాసరే మీరు ప్రయాణము చేయండి' అన్నాడు ప్రఖ్యాత సైంటిస్టు ఐన్‌స్టీన్.

మనము రియాలిటీ రియలైజు చేయుటకోసము ఎందరెందరో మహాత్ములు ఎన్నెన్నో మార్గాలను మనకు బోధించారు. మీకు నచ్చిన మార్గాన్నే మీరు ఎంచుకోండి - మీ మార్గములో మీరు ప్రయాణము చేయండి - మీరెవరో మీరు తెలుసుకోండి - మీ జన్మను జ్ఞానముతో పండించుకోండి - మీరు దుఃఖములో నుంచి బయట పడండి - మీరు శాంతిగా ఉండండి - మీ శాంతిని మీతోటివారికి పంచిపెట్టండి.

మీ

ఆత్మీయుడు

# 1

మీలో సోషలిస్టులు ఉండవచ్చు, కమ్యూనిష్టులు ఉండవచ్చు, కాంగ్రెస్‌వారు ఉండవచ్చు. హిందువులు ఉండవచ్చు, మహమ్మదీయులు ఉండవచ్చు, క్రైస్తవులు ఉండవచ్చు. ఆస్తికులు ఉండవచ్చు, నాస్తికులు ఉండవచ్చు. కాని మీరందరు 'నేను, నేను' అని అంటున్నారా ? - లేదా ? మీలో దేవుడు లేడనేవారు ఉంటే ఉండవచ్చును - కాని "నేను లేను" అని చెప్పగలవారు ఎవరైనా ఉన్నారా? "మీరు లేరు" అని అంటే మీరు ఎవరైనా ఊరుకుంటారా? "నేను లేనంటావా?" అని మీకు యింత పొడుగు కోపము వస్తుంది - చివరికి మొద్దబ్బాయిని అన్నా వాడూ ఊరుకోడు! మనందరికీ "నేను" ఉంది! ఈ'నేను' అంటేనే మనందరికీ ఎంతో యిష్టము. అసలు మనము బ్రతుకుతున్నదే ఈ 'నేను'ను అలంకరించుకొనుట కోసము! దేవుడు "ఉన్నాడో - లేడో" అది మన అనుభవములో లేదు. మన అనుభవములో లేని దేవుని గొడవ అటుంచండి! కాని ఈ "నేను" మన అనుభవములో ఉంది! మరి ఈ "నేను" మాటేమిటి? ఈ'నేను'ను గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా?

మీరు ఎన్నో విషయాలను గురించి ఆలోచిస్తున్నారు గదా? రాజకీయ నాయకులు రాజకీయాలను గురించి

ఆలోచిస్తున్నారు, లాయరు లా గురించి ఆలోచిస్తునాడు, వైద్యుడు వైద్యాన్ని గురించి ఆలోచిస్తునాడు, సైంటిస్టు సైన్సును గురించి ఆలోచిస్తున్నాడు, వ్యాపారస్తుడు వ్యాపారమును గురించి ఆలోచిస్తునాడు, భక్తుడు భగవంతుణ్ణి గురించి ఆలోచిస్తున్నాడు. నిజమే! మీరందరూ ఆలోచిస్తున్నారు - కాని మీ లోపల "ఆలోచించేవాడు" ఒకడు ఉంటే ఆలోచిస్తున్నారా - లేకుండానే ఆలోచిస్తున్నారా? మరి ఆలోచించే ఆ 'నేను' ఎవడు? వాడిని గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా? వాడి మూలాన్ని మీరు ఎప్పుడైనా శోధించారా?

"మాకు అన్ని తెలుసు, ఇన్ని తెలుసు, ఎన్నో తెలుసు" అని మీరందరూ అంటున్నారు. ఔను! నిజమే! మీకు తెలియనిది ఏముంది ఈ లోకములో? మీకు అన్నీ తెలుసు! చంద్రలోకంలో ఏముందో మీకు తెలుసు - సూర్యలోకంలో ఏముందో మీకు తెలుసు! కాని మీకు తెలియనిదల్లా ఒక్కటే- మీ లోపలవుండి యివ్వన్నీ తెలుసుకుంటున్న ఆ 'నేను' ను గురించి మాత్రము మీకు ఏమీ తెలియదు.

ఈ 'నేను' ఎవరో మీకు తెలిసే వరకు - మీకు చావు పుట్టుకలు తప్పవు, సుఖదుఃఖాలు తప్పవు, లాభనష్టాలు తప్పవు, రోగాలు రొష్టులు తప్పవు, కష్టాలు కన్నీళ్ళు తప్పవు, భయము తప్పదు, బాధ తప్పదు, అశాంతి తప్పదు,

ఆందోళన తప్పదు, ఆవేదన తప్పదు - తప్పదు - తప్పదు.

మీరు హిందువులైనా, బౌద్ధులైనా, క్రైస్తవులైనా, మహమ్మదీయులైనా - ఈ సృష్టిలో సుఖాన్ని కోరుకోని జీవుడు ఉన్నాడా? మీరు లెఫ్టిస్టులైనా, రైటిస్టులైనా, లెనినిస్టులైనా, సోషలిస్టులైనా - మీ అందరికీ సుఖంకావాలి. కాని"నేను సుఖంగా ఉన్నాను" అని గుండెలమీద చేయివేసుకొని చెప్పగల ధైర్యవంతుడు మీలో ఒక్కడు - ఒక్కడు ఉన్నాడా? మీలో మరణ భీతిలేనివాడు, దుఃఖ స్పర్శలేనివాడు కనీసం ఒక్కడు ఉన్నాడా? ఒక వేళ మీరు తాత్కాలికంగా సుఖంగా ఉన్నప్పటికీ - మీరు అనుభవిస్తున్న సుఖాలు నిజముకాదు. మీ బాహ్యసుఖాలు శాశ్వతమని మీరు భ్రమపడకండి. మీరు అనుభవిస్తున్న సుఖాలు నీళ్ళు కలిపిన పాలు వంటివి! ఈ సుఖాలు జారిపోవటానికి ఎంతోకాలము పట్టదు. మీ "నేను" మూలాన్ని మీరు తెలుసుకొనేవరకు దుఃఖము మిమ్ములను వెంటాడుతూనే ఉంటుంది. మీ"నేను" మూలాన్ని మీరు ఎప్పుడైతే తెలుసుకున్నారో - అప్పుడు - మీరు గాఢనిద్రలో ఎంత సుఖంగా ఉంటున్నారో, ఎంత శాంతిగా ఉంటున్నారో - ఆ సుఖము, ఆ శాంతి మీరు ఎరుకలో ఉండగా, ఈ దేహములో ఉండగానే మీ సొంతమౌతాయి. కనీసం మీ సుఖం కోసమైనా మీరెవరో మీరు తెలుసుకోరా?

మనము అంటున్న ఈ "నేను"- ఇరుగు పొరుగు వారిని

గురించి తెలుసుకోమంటే- తెలుసుకుంటుంది, రాజకీయాలను గురించి తెలుసుకోమంటే -తెలుసుకుంటుంది, ఇతర లోకాలను గురించి తెలుసుకోమంటే - తెలుసుకుంటుంది, దేవుణ్ణి గురించి తెలుసుకోమంటే - తెలుసుకుంటుంది. బడి కట్టమంటే - బడి కడుతుంది, గుడి కట్టమంటే - గుడి కడుతుంది. "రామ" అనమంటే - రామ అంటుంది, "యేసు" అనమంటే - యేసు అంటుంది - ఎన్నైనా చేస్తుంది! కాని దాని మూలాన్ని గురించి తెలుసుకోమంటే మాత్రం - అది అంగీకరించదు! "నాజోలికి మాత్రం రాకు" అని అంటుంది! ఎందుచేత? దాని మూలాన్ని తెలుసుకుంటే - దాని ఉనికికే ముప్పు వస్తుంది. దాని అస్తిత్వాన్ని అది కోల్పోతుంది! ఎదుటివారిని చంపమంటే మనము చంపుతాముగాని ; మనల్ని చంపుకోటానికి మనము యిష్టపడతామా? అలాగే దానిని చంపుకోటానికి అది మాత్రము యిష్టపడుతుందా?

"నేను దేవుణ్ణి తెలుసుకుంటాను, నేను దేవుణ్ణి తెలుసుకుంటాను" అని మీరందరూ అంటున్నారు - మీ రాముడు గాని, కృష్ణుడుగాని, అల్లాగాని, యేసుగాని మిమ్మల్ని ఎప్పుడైనా అడిగారా 'నన్ను తెలుసుకోవయ్యా" అని? మరి వాళ్ళు అడగనప్పుడు వాళ్ళ గొడవ మీకెందుకు?

గొడవో, వైకుంఠము గొడవో తీసి ప్రక్కన పెట్టండిమీలో రచయితలు ఉండవచ్చు, రాజకీయవేత్తలు ఉండవచ్చు, మేధావులు ఉండవచ్చు, సైంటిస్టులు ఉండవచ్చు, ఆర్టిస్టులు ఉండవచ్చు, చదువుకున్నవారు ఉండవచ్చు, చదువురానివారు ఉండవచ్చు - కాని మీరెవరో మీకు తెలుసా? మీరు "నేను, నేను" అని అంటున్నారే - ఆ నేను ఎవరో మీకు తెలుసా? "నేను" లేకుండా మీరు వున్నారా? మీరు లేకుండా - మీ దేహముందా, లోకముందా, మీరు పూజించే దేవుళ్ళు వున్నారా?

అందరూ మాకు దుఃఖముగా వుందంటున్నారు - మీకు "నేను" వుంటే దుఃఖముందా - "నేను" లేకుండానే దుఃఖముందా? అందరూ మాకు సంసారము వుందంటున్నారు - మీకు "నేను" వుంటే సంసారముందా - "నేను" లేకుండానే సంసారముందా? మరి గాఢనిద్రలో మీ దుఃఖమంతా ఎక్కడికి పోతున్నది మీ సంసారము ఏమౌతున్నది? మీకు ఒక దేహముందని, దానికి ఒక పేరు వుందని - మీకు 'నేను' ఉంటే తెలుస్తున్నదా - 'నేను' లేకుండానే తెలుస్తున్నదా? ఈ సృష్టిలో ఏదైనా ఒక వస్తువును మీరు 'నాది' అని అంటున్నప్పుడు - మీరు 'నేను' ఉంటే అనుకుంటూన్నారా - 'నేను' లేకుండానే అనుకుంటూన్నారా? మరి ఈ నేను ఎవరు? ఈ 'నేను' అనేది రాముడి సమస్యకాదు, కృష్ణుడి సమస్యకాదు,

రమణుడి సమస్యకాదు - ఇది మీ సమస్య. సమస్యలకు సమస్య అయిన మీ సమస్యను మీరు పరిష్కరించుకోరా!

మీరు రాముడి వెనకాలో, కృష్ణుడి వెనకాలో, రమణుడి వెనకాలో, యేసుక్రీస్తు వెనకాలో రాజకీయ పార్టీల్లాగా పరుగెడుతున్నారు - మీ సమస్యను విడిచిపెట్టి మీరు ఏదో ఒక దేవుని వెనకాల స్తోత్రాలు చేసుకుంటూ ఎంతకాలము ఇలా ఊరేగుతారు? రాముడు జ్ఞాని, కృష్ణుడు జ్ఞాని, రమణుడు జ్ఞాని, యేసు జ్ఞాని - అయితే మీకు కలిసివచ్చినదేమిటి? మీరు అజ్ఞానముతో బాధపడుతున్నప్పుడు - ఎవరికో జ్ఞానము ఉంటే మీకు ఒరిగేదేమిటి? ఎవడికో కోటిరూపాయలు ఉంటే ఏమిటి లాభం - మీరు ఆకలితో బాధపడుతున్నప్పుడు? ఆచారాలు, ప్రచారాలేనా మీగమ్యం? మీ స్వార్థం మీరు చూసుకోరా? మీరెవరో మీరు తెలుసుకోరా? మీరెవరో మీరు తెలుసుకోకుండా మీరు దేవుణ్ణి తెలుసుకోవాలనుకుంటే అది బండిని ముందుపెట్టి, వెనుక గుఱ్ఱాన్ని కట్టుట వంటిది!

అన్ని అవకాశాలూ ఉన్నప్పుడే మీరెవరో మీరు తెలుసుకోలేకపోతే - మరణానంతరం ఎలా తెలుసుకుంటారు? దీపం ఉండగా చదువుకోని కుర్రవాడు దీపం ఆర్పివేసినతరువాత చదువుకుంటాడా? దేహముండగా ఈ 'నేను' మూలాన్ని మీరు శోధించి తెలుసుకోలేకపోతే - మరణానంతరం మీరు సాధన చేసి

తెలుసుకొనే అవకాశమేలేదు. ఈ జన్మలో మీరు ఈ 'నేను'ను తెలుసుకోకుండా దూరంగా పారిపోయినా - కోటి జన్మల తరువాతనైనా మరల మీరు తిరిగి ఈ 'నేను' దగ్గరకు రావలసినదే! పక్షి ఆకాశంలోనికి ఎంత ఎత్తునకు ఎగిరినప్పటికి మరల అది తిరిగి ఈ భూమిమీదకు వచ్చే వరకు దానికి విశ్రాంతిలేదు. అదే విధముగా ఈ 'నేను' మూలాన్ని మీరు తెలుసుకొనేవరకు - మీకు శాంతిలేదు, విశ్రాంతిలేదు - జన్మలు మిమ్ములను వెంటాడతాయి, దుఃఖము మిమ్ములను వెంటాడుతుంది. ఈ 'నేను' అనేది మీ సమస్య. మీ సమస్యను విడిచిపెట్టి మీరు ఎంతకాలము యిలా తప్పించుకు తిరుగుతారు?

మనము ఊహతెలిసినది మొదలు 'నేను, నేను' అని అందరూ అంటూనే ఉన్నాము. మిరూ 'నేను' అంటున్నారు - నేనూ 'నేను' అంటున్నాను. ప్రధానమంత్రి 'నేను' అంటున్నాడు - బంట్రోతు 'నేను' అంటున్నాడు, పండితుడు 'నేను' అంటున్నాడు - పామరుడు 'నేను' అంటున్నాడు. ధనవంతుడు'నేను' అంటున్నాడు - దరిద్రుడు 'నేను' అంటున్నాడు. ఒక్క గాఢనిద్రలో తప్ప - మెలుకువలోను, స్వప్నములోనుకూడా ఈ 'నేను' మనల్ని పిశాచములాగ పట్టి పీడిస్తున్నది, దెయ్యములాగ దాని యిష్టము వచ్చినట్లు ఆడిస్తున్నది.

నిజమనేది నిత్యమూ ఉంటుంది - అది కాలానికి

అతీతము. మనము అంటున్న ఈ'నేనే' గనుక నిజమైతే - అది గాఢనిద్రలో కూడ ఉండి తీరాలి. కాన్నీ గాఢనిద్రలో ఈ'నేను' లేకుండా మనము సుఖముగా ఉండగలుగుతున్నాము. మరి ఈ 'నేనే' గనుక నిజమైతే గాఢనిద్రలో ఈ 'నేను' లేకుండా మనము ఉండగలమా?

నిజమనేది ఎప్పుడూ ఒకటిగానే ఉంటుంది. ప్రస్తుతము ప్రపంచములో 500 కోట్ల ప్రజలున్నారు - 500 కోట్ల 'నేను'లు ఉన్నాయి. మరి ఈ 'నేను'లన్నీ నిజమేనా? నిజము 500 కోట్లుగా ఉంటుందా?

'వారు చెప్పేదీ నిజమేనండి - వీరు చెప్పేది నిజమేనండి' అని కోర్టులో ఎవడైనా సాక్ష్యము చెబితే జడ్జీ అంగీకరిస్తాడా? వాడిని వెంటనే మెంటల్ హాస్పటల్‌కు పంపించమంటాడు - ఎందుచేత? నిజమనేది ఏదో ఒకటిగానే ఉంటుంది గాని - రెండుగా ఉండదు. అటువంటప్పుడు ఈ 500 కోట్ల 'నేను'లు మాత్రము నిజమెలా అవుతాయి?

నిజములో నుంచి సుఖము వస్తుంది - శాంతి వస్తుంది. కాని మనలో ఎవరైనా సుఖముగా, శాంతిగా ఉన్నామా? మరి మనము అంటున్న ఈ 'నేనే' గనుక నిజమైతే - మనము సుఖముగా శాంతిగా ఎందుకు లేము? - ఈ లోకములో యింత అశాంతి, దుఃఖము ఎందుకు తాండవిస్తున్నాయి?

ఈ 'నేను' అబద్ధము కాబట్టే - గాఢనిద్రలో ఈ 'నేను' గొడవలేనప్పుడు మనము సుఖముగా, శాంతిగా ఉండగలుగుతున్నాము. అంత గాఢనిద్రలోనుంచి మనకు మెలుకువరాగానే - మరల మనకు 'నేను' అను తలంపు వస్తున్నది. ఆ'నేను' తలంపు రాగానే సైన్యము వచ్చినట్లు - మన దేహము, మన సంసారము, మన యిష్టము - అయిష్టము, మన ఆశలు - ఆశయాలు - అభిరుచులు అన్నీ గుర్తుకు వస్తున్నాయి - మరల మనల్ని అశాంతికి గురిచేస్తున్నాయి. మన అశాంతికి మూలమైన ఈ 'నేను' మూలాన్ని గురించి మీరెప్పుడైనా ఆలోచించారా?

## 2

దేహము జడము. దానికి 'నేను' అని చెప్పగల శక్తిలేదు. ఆత్మ చావు, పుట్టుకలు లేని చైతన్యము. దానికి 'నేను' అని చెప్పవలసిన అవసరములేదు. మరి 'నేను' అని చెప్పే ఈ 'నేను' ఎవరు?

జడమైన దేహమును - చైతన్యమైన ఆత్మను కలిపి ముడిపెడుతూ రెండింటికిమధ్యన దేహ పరిమితమైన మిథ్యా 'నేను' ఒకటి పుట్టుచున్నది. అదే చిజ్జడ(చిత్ + జడ) గ్రంథి! దానినే కారణ శరీరమని, అహంకారమని, అజ్ఞానమని, జీవుడని అంటారు.

దానికి నామంలేదు, రూపంలేదు, రంగులేదు,

లింగంలేదు, జాతిలేదు, కులంలేదు, మతంలేదు, దేశంలేదు. ఈ 'నేను' అనునది కేవలం ఒక తలంపు మాత్రమే - అది నిజముకాదు. మనకువచ్చు తలంపులలో ఈ 'నేను' అనునది ప్రథమ తలంపు, ప్రధాన తలంపు, పునాది తలంపు - ఈ 'నేను' అను తలంపునకే మిగిలిన తలంపులన్నీ వచ్చుచున్నవి - అదే మనస్సు! 'నేను, నేను' అని మన మనస్సే అంటున్నది!

ఈ 'నేను' అను తలంపు మన లోపలినుంచే, సాక్షాత్తు దేవుని దగ్గరనుంచే వస్తున్నది. అందుకే ప్రతీ మనిషి 'నేను, నేను' అని గుండెలమీద కుడివైపున క్రిందిభాగములోనే చేయివేసుకుంటాడు. అంటే ఆ 'నేను'కు మూలం అక్కడనే ఉంది. అదే ఆధ్యాత్మిక హృదయం. అది మన దేహములోపల ఉన్నమాట నిజం. కాని అది మన దేహములో ఒక భాగము మాత్రము కాదు. అందుకే దేహమును కోసిచూస్తే - అది మన కళ్ళకు కనిపించదు. దానికి మన దేహమునకు అణుమాత్రము కూడ సంబంధములేదు. దేహమును దహించినప్పటికి అది దహించబడదు.

ఆ హృదయములో ఆత్మ 'నేను, నేను' అనుచు స్వయముగా ప్రకాశిస్తున్నది. ఆ చైతన్యమే గనుక మన హృదయములో లేకపోతే - మనకు 'నేను' అను తలంపుకూడ పుట్టదు. నీటిలోనుంచి బుడగ వచ్చినట్లు -

ఆ అంఖడమైన ఆత్మగతమైన అసలు 'నేను'లో నుంచే ఈ పరిమితమైన 'నేను' అను తలంపు పుట్టుచున్నది. సూర్యకాంతినుంచి వెలుబడిన ఒకానొక కాంతి కిరణమువలె - ఆత్మశక్తినుంచి వెలువడిన ఒక నొకఅతిశయశక్తే ఈ 'నేను' అను తలంపు. కాని అది దాని పుట్టినచోటును మరచిపోయి - తాను స్వయంభవుణ్ణి అనుకొని స్వతంత్రముగా వ్యవహరిస్తున్నది. సూర్యకాంతి లేకపోతే చంద్రుడు స్వయముగా ప్రకాశించగలడా? అదే విధముగా, మనము అంటున్న ఈ 'మిథ్యానేను' స్వతంత్రమైనదికాదు. ఆత్మశక్తే దానికి ఆధారము.

ఈ మిథ్యా 'నేను' దేహానికి పరిమితమైనప్పటికి - అది జడముకాదు - చైతన్యముకాదు. దేహము మరణించినప్పుడు అది మరణించదు - దేహమును దహించినప్పుడు అది దహించబడదు. కేవలము ఒక్క జ్ఞానాగ్ని మాత్రమే దానిని దహించగలదు.

## 3

ఈ 'నేను' అను తలంపు (అహంకారము) పుట్టినప్పుడే జీవుడు పుట్టాడు - మరల ఈ 'నేను' అను తలంపు మరణించినప్పుడే జీవుడు మరణిస్తాడు. అహంకారము యొక్క పుట్టుకే నిజమైన పుట్టుక -

అహంకారము యొక్క మరణమే నిజమైన మరణము దేహముయొక్క పుట్టుక పుట్టుకా కాదు - మరణము మరణమూ కాదు.

దేహము మరణించినంత మాత్రాన జీవుడు మరణించడు. మరణము అంటే మార్పు! ఆ శరీరము శిధిలమైపోతే మరో కొత్త శరీరములోనికి మారతాడు - అంతే! మరణము వలన దేహాలు మారతాయి, పరిసరాలు మారతాయి, పరిస్థితులు మారతాయి, తల్లిదండ్రులు మారతారు, భార్యాబిడ్డలు మారతారు, బంధుమిత్రులు మారతారు. కాని జీవుడు మాత్రం మారడు - వాడు మరణించడు. జ్ఞానము కలిగేవరకు ఆ సుబ్బారాయుడు సుబ్బారాయుడుగానే ఉంటాడు. వాడికే మరలమరో కొత్త శరీరమువచ్చితగులుకుంటుంది. జ్ఞానము కలిగేవరకు దేహము లేకుండా జీవుడు ఉండలేడు.

స్మశానముతో శరీరగతమైన చరిత్ర ముగుస్తుందేగాని - జీవుని చరిత్ర ముగియదు. ఏజన్మకు ఆజన్మ ఆ దేహమే నిజమనుకుంటాడు - తానుకాని ఆ దేహం కోసము, తానుకాని ఆ పేరుకోసము ప్రాణము పోయేవరకు వాడు ప్రాకులాడుతూనేఉంటాడు. దేహము ఎర్రగా ఉంటే ఎర్రగా ఉన్నాననుకుంటాడు, దేహము పురుషుడైతే - తాను పురుషుణ్ణి అనుకుంటాడు, దేహము ఏ కులములో పుడితే - ఆ కులము తనదనుకుంటాడు, దేహము ఏ మతములో పుడితే - ఆ మతము తనదనుకుంటాడు,

దేహానికి రోగమువస్తే - తనకు రోగము వచ్చినదనుకుంటాడు, చివరికి దేహము మరణిస్తుంటే - తాను మరణిస్తున్నాననుకుంటాడు. ఇలా దేహముతో తాదాత్మ్యము పొందుతున్నంతకాలము మానవుడు మరణాన్ని అతిక్రమించలేడు.

'నీవు ఆత్మ స్వరూపడవు - నీకు మరణము లేదు' అని శాస్త్రము చెబుతున్నది. కాని మనమందరము 'నేను' చనిపోతున్నాను, నేను ఇంకా ఎంతోకాలము జీవించను' అని అంటున్నాము - మరి ఆ చనిపోతున్నాను అని చెప్పేవాడు ఎవడు? శరీరము చెపుతున్నదా - లోపల వున్న జీవుడు చెపుతున్నాడా? శరీరానికి మాటలాడేశక్తి ఉందా? శరీరానికే గనుక నిజముగా మాటలాడే శక్తి ఉంటే- శవము కూడ 'నేను' అని అనాలి - స్మశానానికి తీసుకువెడుతుంటే 'నన్నెందుకు తీసుకువెళుతున్నారు?' అని తిరగబడి అడగాలి! కాని ఇప్పటివరకు ఏ శవమైనా అలా తిరగబడి అడిగిందా? ఏం? ఎందుచేత అడుగటలేదు? శరీరానికి మాటలాడే శక్తిలేదు - ఆ శరీరములో మాటలాడేవాడు ప్రక్కకు తప్పుకున్నాడు.'ఈ దేహము నాది' అని చెప్పేవాడు లేడు అక్కడ.

మరణించినవారికోసము బ్రతికి ఉన్నవాళ్ళు ఎంతగానో విలపిస్తూ ఉంటారు! కాని అప్పటివరకు 'మా బిడ్డ, మా బిడ్డ' అని వాళ్ళు మురిసిపోయినది - ఆ ఐదడుగులో, ఆరడుగులో దేహాన్ని చూసుకొనేగా? వాళ్ళు

మమకారాన్ని పెంచుకొని, అనురాగాన్ని పంచుకున్న వారి ముద్దుల బిడ్డ దేహం వారి కళ్ళముందు ఉంచుకునే మరి ఎవరికోసం వారు రోదిస్తున్నారు? వాళ్ళు జన్మయిచ్చినది దేహానికేగాని - జీవునికి కాదుగా? వారు జన్మయిచ్చిన ఆ దేహము వారి కళ్ళముందే ఉందిగా? మరి ఎవరికోసం వారి రోదన? ఎవరికోసం వారి వేదన? వారికి, ఆ జీవుడికి ఏమిటి సంబంధం? వాడి సంస్కారాలను వాడు మూటగట్టి తెచ్చుకున్నాడు - వాడి ప్రారబ్ధాన్ని వాడు అనుభవించాడు - వాడు వచ్చిన పనిని పూర్తి చేసుకొని, వాడి దారిన వాడు వెళ్ళిపోతున్నాడు. శ్వాస ఆగిపోగానే వారి దేహసంబంధాలు కడతేరిపోతున్నాయి. వీరు ఎంతగా గుండెలు బాదుకొని ఏడ్చినా ఇక వాడికి వినిపించదు - వాడిక వీరికి కనిపించడు. మరి వాడి కోసము వీరెందుకు శోకిస్తున్నారు?

మన కళ్ళముందు ఎందరో మరణించుటను మనము ప్రతి నిత్యము చూస్తూనే ఉంటాము - కాని మనము మాత్రము శాశ్వతముగా ఉంటామని అనుకుంటాము. దేహమాత్రుడినేతాను అనుకున్న ప్రతివాడికి మరణము తప్పదు - ఈ రోజు కాకపోతే మరోరోజు - అంతే తేడా! తల్లి గర్భములోనుంచి ఈదేహము పుట్టినప్పుడేచావు కూడా పుట్టినది. కాకపోతే పుట్టుకకు చావుకు మధ్యన కొంత గేప్ ఉంటుంది.

మనము ఎంతో ప్రేమతో పెంచి పోషించుకుంటున్న

ఈ శరీరము ఇప్పుడు కూడ శవమే! కాకపోతే ప్రాణమున్నంతసేపు ఎవడిశవాన్ని వాడే మోసుకుంటున్నాడు - ప్రాణము పోయిన తరువాత వల్లకాటికి నలుగురు మోస్తారు - అంతేతేడా! ముక్కులో గాలి తిరుగుతున్నంత కాలము అంతా తన గొప్పేననుకుంటాడు ప్రతీఒక్కడు. తాను లేకపోతే ఈ సృష్టి ఆగిపోతుందనుకుంటాడు. దేవాలయం మీద ఉన్న బొమ్మలు ఆ గోపురం బరువంతా తామే మోస్తున్నామని అనుకుంటాయట! 'అబ్బబ్బ! ఎన్నెన్ని రాతలు వ్రాస్తున్నానో' అని మన చేతిలోనున్న పెన్ను అనుకోవటం ఎటువంటిదో - ఈ లోకాన్నంతా మనమే ఉద్ధరిస్తున్నామని అనుకోవటం కూడా అటువంటిదే! మనకంటే ముందు ఎందరో పుట్టి ఈ మట్టిలో కలిసిపోయారు. మరి ఎవరి కోసమైనా ఈ సృష్టి ఆగిపోయినదా? కనీసం వారు ఈ భూమిమీదకు వచ్చి వెళ్ళిన గుర్తైనా ఉన్నదా? ఇదంతా అహంకారము యొక్క మోత! మరణానంతరం మనతో వచ్చేవారు ఒక్కరుఒక్కరు ఉన్నారా?

మరణము చెంతకు వచ్చినప్పుడు ఎవడి చేతిలోనైతే మరణము ఓడిపోతుందో - వాడు జ్ఞాని. మరణము చేతిలో ఓడిపోయినవాడు అజ్ఞాని. మనిషి ఎంతకాలమైతే మరణాన్ని జయించలేడో - అంతకాలము వాడు తిరిగి కష్టాల ఒడిలో పుట్టవలసినదే. ఒక దేహముతోటి.

కులముతోటి, మతముతోటి, ఇంద్రియ జ్ఞానముతోటి తాదాత్మ్యమును పొందేవాడు మరణమును అతిక్రమించలేడు. తన హృదయములో నున్న అమృత స్థితి ఎవడికైతే అనుభవములోనికి వచ్చినదో - వాడు మాత్రమే మృత్యువును జయిస్తాడు. ఆ అమృత స్థితి మన అనుభవములోనికి రాకుండా మన అహంకారమే మనకు అడ్డుపడుతున్నది.

తానెవరో తనకు తెలియనంతకాలము మానవుడు అహంకారమనే గూటిలోనుంచి విడుదల పొందలేడు. అహంకారానికి ఒక రూపములేదు. కాని అది రూపమును పట్టుకొని పుడుతుంది - రూపమును విడిచి రూపమును దాల్చుతుంది - దాని మూలమును వెదకితే అది మనలను విడిచి పరుగెడుతుంది.

దేహగతమైన ఈ 'నేను' అను అహంకారమును ఎవరైతే అతిక్రమించారో - వానిలో ఈ సమస్త సృష్టి లయించి పోతుంది. దేవతలు కూడ లయించి పోతారు. ఏ సుఖాన్ని పొందిన తరువాత మన మనస్సు మరల ఏ ఇతర సుఖాలను కోరదో - ఆ పరమ సుఖం, ఆ పరమశాంతి మన చేతికి అందుతుంది.

## 4

'నేను' అను తలంపు పుట్టకముందు ఉన్న స్థితియే

మనము ఆదిగా ఉన్న స్థితి. 'నేను' అను తలంపు కొంచెముకూడ లేని చోటనే స్వరూపము ఉంది. ఈ'నేను' అను ఒంటిస్థంభము మీదనే ఈ సృష్టి అంతా ఆధారపడి ఉన్నది. ఈ'నేను' అను తలంపును దాని పుట్టుచోటైన ఆత్మలో నిలిపి ఉంచగలిగితే - అదియే నిజమైన సాధన - అదియే నిజమైన మౌనము - అన్నారు భగవాన్ శ్రీ రమణ మహర్షి.

మరుగున పడిపోతున్న జ్ఞానమార్గాన్ని పునరుద్ధరించి, ఆత్మ సాక్షాత్కారానికి'నేను ఎవడను?' అను విచారణ పద్ధతిని బోధించి, ఆధ్యాత్మిక రంగములో ఒక నూతన విప్లవాన్ని తీసుకువచ్చి, నవయుగానికి నాంది పల్కిన అవతార పురుషుడే భగవాన్ శ్రీ రమణ మహర్షి. హృదయములో ప్రత్యక్షముగా ప్రకాశిస్తున్న ఆత్మను తెలుసుకొనుటమాని ఆత్మకోసము శాస్త్రములను శోధిస్తున్న మానవ మానాసాన్ని తన ఆధ్యాత్మిక శక్తితో అంతర్ముఖపరచి, ఆత్మ నిష్ఠకు దారి చూపుటకే ఆయన ఈ భూమిమీద అవతరించాడు. " 'నేను' అను తలంపు ఎక్కడ పుడుతున్నదో చూడు అక్కడే మనస్సు లయిస్తుంది - అదే తపస్సు" అని తపస్సునకే ఒక కొత్త నిర్వచనాన్ని చెప్పిన ఆచార్యవరిష్ఠుడే శ్రీ రమణాచార్యుడు.

చాలామంది అడుగుతూ ఉంటారు - "ఏదో పూజ చేసుకోమని, జపము చేసుకోమని, ధ్యానము చేసుకోమని

చెప్పాలిగాని - ఈ నేనెవడను గొడవ ఏమిటండీ" - అని! మనకు యిష్టమైన మాటలు చెప్పి మన మెప్పులు పొందటానికి శ్రీ రమణస్వామి ఈ భూమిమీదకు రాలేదు - సాధనలపేరుతో సమస్యలను పెంచుకొని సత్యానికి దూరమైపోతున్న సమాజాన్ని నిజమువైపు నడిపించడానికి వచ్చిన అవతారమే శ్రీ రమణావతారం. మీరు పూజచేసినా, జపము చేసినా, ధ్యానము చేసినా - మీ 'నేను' మూలము మీకు తెలియనంత కాలము మీకు ముక్తిలేదు.

కొంతమంది అంటూ ఉంటారు - "రమణ మహర్షి గమ్యం గురించే ఎక్కువగా చెప్పాడు గాని- గమ్యం చేరటానికి మార్గం గురించి ఎక్కువగా చెప్పలేదు- అని! మనమందరము ఆత్మ ఎక్కడో ఉందని, దానిని సాధనచేసి పొందాలని అనుకుంటున్నాము. మనము ఏదైతే కానో - అది కాదనుకుంటున్నాము; మనము ఏదైతే కాదో - అది కాననుకుంటున్నాము. ప్రత్యక్షముగా ఉన్న వస్తువును అప్రత్యక్షము చేసుకొని - మార్గం కోసము మనము వెతుక్కుంటున్నాము. మీరెవరో మీకు తెలిస్తే- ఆ గమ్యమే మీరౌతారు. ఆ గమ్యమే మీరైనప్పుడు మీకు ప్రయాణముతో పనేముంది?

మరికొంతమంది అంటూ ఉంటారు - " 'నేను'ను గురించి ఈ రమణ మహర్షి క్రొత్తగా చెప్పేదేమిటి - పూర్వపు ఋషులుకూడ పురాణాలలో, ఉపనిషత్తులలో

ఈ 'నేను'ను గురించి చెప్పారుగా?" అని! ఔను| నిజమే| పూర్వపు ఋషులు ఈ'నేను'ను గురించి చెప్పినమాట వాస్తవమే. కాని ఆ 'నేను'ను కూల్చటానికి ఒక నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, నవ్యమార్గాన్ని ఆవిష్కరించిన ఋషివరేణ్యుడే భగవాన్ శ్రీ రమణమహర్షి.

మనకు యోగ్యత లేకపోతే, మన హృదయములో సౌందర్యము లేకపోతే, మన బుద్ధిలో పవిత్రత లేకపోతే - మన కళ్ళముందు ఒక మహాత్ముడు కనిపిస్తున్నప్పటికీ - ఆ మహనీయుని ఆధ్యాత్మిక అంతస్తునుగాని, అందాలనుగాని, ఔన్నత్యాన్నిగాని మనము కళ్ళుండి చూడలేము - చెవులుండి. వినలేము - బుద్ధుండి గుర్తించలేము.

## 5

శ్రీ రమణానుగ్రహముతో జీవితపు ఆవలి ఒడ్డునుంచి 'శాంతి' అనే రేవును చేరుకొని, మోక్షసుఖాన్ని అనుభవిస్తూ, గృహస్తుగా జీవిస్తూ, తన జీవితాన్నే ఒక సందేశముగా చూపిస్తూ, తన కరుణతో ఎందరి కన్నీళ్ళనో తుడుస్తూ, అజ్ఞానాంధకారములో అలమటిస్తున్న ఎందరి జీవితాలలోనో జ్ఞానదీపాలను వెలిగిస్తూ, రమణ తత్వాన్ని సూటిగా, సరళంగా, సహజంగా బోధిస్తూ ఆత్మను మన చేతికి పట్టి చూపుతున్న సద్గురువే జిన్నూరు శ్రీ

నాన్నగారు.

హృదయములోనున్న వాసనలు నిశ్శేషముగా బయటికి పోకుండా ఏ జీవుడు జ్ఞానికాలేడు. కోటలో శత్రువులున్నంతకాలము కోట మన స్వాధీనమౌతుందా?

పూర్వజన్మలలో మనము ఎంతో యిష్టముతో చేసిన పనులే వాసనలుగా మన హృదయములో దాగిఉండి - తలంపుల రూపములో మన శిరస్సులో విజృంభించి ఈ జన్మలో మనకు ఎంతో దుఃఖాన్ని తీసుకువస్తున్నాయి. ఈ తలంపుల బాధనుంచి బయట పడటానికే మనము సాధనలు మొదలుపెట్టాము.

"నేను ఎంతో కాలము నుంచి మీ హృదయములో కాపురమున్నాను - ఇప్పుడు మీకు భక్తి కావలసి వచ్చి నన్ను బయటికి పొమ్మంటే నేను పోతానా?" అని ఆ తలంపులు యిప్పుడు తిరగబడుతున్నాయి. పూర్వ జన్మలలో ఎంత యిష్టముతోనైతే ఆ పనులు మనము చేశామో - అంతే యిష్టముతోటి వాటికి వ్యతిరేకమైన భావాలను మన హృదయములో ప్రవేశపెట్టి, యిప్పుడు ఎంతో సాధన చేస్తేనేగాని ఆ వాసనలు బయటికి పోవు.

స్వప్రయత్నము, కాలపరిపక్వము, ఈశ్వరకటాక్షము కలిసి రాకపోతే - మన హృదయములో నున్న ఒక్క వాసనను కూడ మనము బయటికి తీసుకోలేము. భగవంతుని పట్ల మనకున్న తపనే గనుక నిజమైతే -

కాలము కలిసి వచ్చి, మన ప్రయత్నమే అనుగ్రహ రూపములో ఎదురు వస్తుంది.

జన్మల తరబడి మనము నామరూప దృష్టికి అనవాటుపడియున్నాము. నామరూప దృష్టికి అలవాటుపడిన మనము - నామములేని, రూపములేని దేవుడిని ఆరాధించుట కష్టము కాబట్టి - మనపట్ల ప్రేమతో మనల్ని తరింపచేయుటకు - అనుగ్రహ స్వరూపుడైన ఆ దేవుడే ఏదో ఒక దేహము ధరించి సద్గురు రూపములో ఈ భూమిమీద అవతరిస్తాడు. అట్టి గురుపరంపరలో శ్రీ నాన్నగారు ఒకరు.

"నేను సద్గురువును" అని ప్రకటించుకున్న ప్రతివాడు గురువుకాదు - సత్యాన్ని దర్శించినవాడే గురువు శబ్దానికి అర్హుడు. సత్యం తెలిసినవాడికి ఈ సృష్టి తనకంటే వేరుగా లేదు. వేరుభావన లేనివాడు 'నేను సద్గురువును' అని ఎవరికి ప్రకటించుకుంటాడు? అహంకారము ఉన్నవాడికి లోకం - అహంకారము లేనివాడికి లోకముందా - ప్రకటించుకోవటానికి? ప్రకటించుకునేవాడు లోపల ఉన్నంతకాలము వాడు గురువుకాదు - బరువు ! మీ సంసార బరువులు మీకు సరిపోవుటలేదా - మరల ఈ బరువులు మీకెందుకు? ఒక గుడ్డివాడు మరో గుడ్డివాడికి దారి చుపించగలడా?

ఏ మహాత్ముని కంటిచూపు మనలోని చైతన్యాన్ని

మేల్కొలుపుతుందో, ఏ పరమపవిత్రుని వాక్కు మనలను వెన్నంటి తరుముతుందో, ఏ పుణ్యపురుషుని పాదస్పర్శ మన మనస్సును అంతర్ముఖపరస్తుందో, ఏ సత్పురుషుని సాన్నిధ్యము మన బుద్ధిని శుద్ధి చేస్తుందో - అతడే మనకు గురువు.

మనము చేసే సాధనలకంటే గురువుయొక్క అనుగ్రహము గొప్పది. అది మన కళ్ళకు కనిపించేది కాదు - మన కొలతలకు దొరికేది కాదు - గురువు చేసే సహాయములోపల మన వాసనలను బయటికిలాగి వాటిని మంటపెట్టే వాడే సద్గురువు. గురువు యొక్క అనుగ్రహము లేకపోతే ఒక్క వాసనను కూడా మనము బయటికి తీసుకోలేము. గురువు అనుగ్రహముతో సమానమైనది ఈ సృష్టిలో మరొకటిలేదు. పులినోటిలోని మాంసపు కండైనా జారిపోతుందేమోగాని - గురువుయొక్క అనుగ్రహములో పడినవాడు మాత్రము రక్షింపబడే తీరతాడు. మీ శ్వాశపోతున్నా గురువుపట్ల వినయాన్ని, విశ్వాసాన్ని విడిచిపెట్టకండి. జ్ఞానము కలిగేవరకు జన్మజన్మలకు మనవెంట ఉండి మనల్ని రక్షించేది మన గురువు ఒక్కడే

శ్రీ నాన్నగారు బోధిస్తున్న రమణతత్వం గనుక మన బుద్ధికి అర్థమైతే - జన్మల తరబడి మనల్ని పట్టిపీడిస్తున్న మన దుఃఖమంతా యిప్పుడే యిక్కడే ఆరిపోతుంది మన స్వరూపము మనకు వ్యక్తమౌతుంది.

# 6

మనకు ఊహతెలిసినది మొదలు ఎన్నో తలంపులు వస్తూన్నాయి - పోతున్నాయి. కాని ఎన్ని తలంపులు మారినప్పటికి - 'నేను' అను తలంపు మాత్రము మారకుండా అన్ని తలంపులకు ఆధారముగా ఆ 'నేను' అను తలంపు కామన్‌గా ఎప్పుడూ ఉంటున్నది. మనకు రాగం వచ్చినా, ద్వేషం వచ్చినా, కామం వచ్చినా, క్రోధం వచ్చినా, లోభంవచ్చినా, మోహం వచ్చినా - ఏది వచ్చినప్పటికి ఈ'నేను' కే వస్తున్నాయి. కామన్‌గా ఎప్పుడూ ఉంటున్న ఈ 'నేను' అను తలంపే మిగిలిన అన్ని తంలపులను విషపూరితము చేయుచున్నది.

ఈ 'నేను' తలంపు, మిగిలిన తలంపులు కలిసి మనస్సు అయినది. లోకములోని అన్ని సమస్యలకు ఈ మనస్సే కారణము. ఈ మనస్సు అనే సమస్యను పరిష్కరించుకునేవరకు మానవుడినీ అన్ని సమస్యలు వెంటాడుతూనే ఉంటాయి.

మనము ఇల్లు విడిచిపెట్టి అరణ్యాలకు వెళ్ళినా - మన మనస్సు మనల్ని విడిచిపెట్టదు. సంసారమంటే మన భార్యబిడ్డలే సంసారము కాదు - మన మనస్సే సంసారము. మనము పరిష్కరించవలసినది ఈ మనస్సునే

మనస్సుకు రూపంలేదు - నామంలేదు. కాని అది

ఎప్పుడూ ఏదో ఒక రూపాన్నో - నామాన్నో పట్టుకునే వేలాడుతుంది. మన శరీరానికి అన్నము మేతైతే - మన మనస్సునకు నామరూపాలే మేత! ఆత్మను తప్ప అన్నింటినీ మన మనస్సే సృష్టించినది. మన మనస్సులో లేనిదేదీ మనకు ఈ సృష్టిలో కనిపించదు.

సాలి పురుగు తన గూడును తానే అల్లుకుంటుంది - అందులోనే కాపురముంటుంది- చివరికి అందులోనే మరణిస్తుంది. అదే విధముగా మన మనస్సే ఈ సంసారమును సృష్టించినది - మన మనస్సే సంసారము చేస్తున్నది - చివరికి ఆ సంసారములో చిక్కుకొని చావుపుట్టుకల వలయములోపడి కొట్టుకుంటున్నది. ఈ సంసారాన్ని ఏ మనస్సు అయితే సృష్టించినదో - దానిని నాసనము చేసే శక్తి కూడ ఆ మనస్సుకే ఉంది.

గడ్డివెంటులోని గడ్డిపరకలను ఒక్కొక్కదానిని తీసివేస్తే చివరికి గడ్డివెంటు అనేది ఉండదు. అదే విధముగ మనస్సులో నున్న తలంపులన్నీ రాలిపోతే మనస్సు అనేది కూడ ఉండదు. పొయ్యిలో ఉన్న పుల్లలను ఒక్కొక్కదానిని బయటికి తీసివేస్తే చివరికి ఆ పొయి ఆరిపోతుంది. అదే విధముగా హృదయములో నున్న వాసనలన్నీ నిశ్శేషముగా బయిటికి పోతే మనస్సు కూడ నశించిపోతుంది.

స్వాధీనములో నున్న మనస్సు మిత్రునివలె మేలు

చేస్తుంది - స్వాధీనములో లేని మనస్సు శత్రువువలే కీడు చేస్తుంది. మనస్సును మచ్చిక చేసుకొనుటకే - పూజ చేసుకోమని, జపము చేసుకోమని, ధ్యానము చేసుకోమని చెప్పారు మన పెద్దలు. చేతితో చేసే పూజకంటే - నోటితో చేసే జపము, నోటితో చేసే జపము కంటె - మనస్సుతో చేసే ధ్యానము - మనస్సుతో చేసే ధ్యానముకంటె - బుద్ధితో చేసే 'విచారణ' గొప్పవి.

ధ్యానమును గురించి ఎంతో గొప్పగా చెప్పారు మన పూర్వపు గ్రంథాలలో! కాని ధ్యానము కూడ కల్పితమే! అదికూడ మనస్సు యొక్క సృష్టేమనస్సు అనే సమస్యను ప్రత్యక్షముగా ఎదుర్కొని పరిష్కరించుకునే ధైర్యములేక ఇలా ఎంతకాలము తప్పించుకు తిరుగుతారు?" అని అడుగుతున్నారు శ్రీ రమణాచార్యుడు మనల్ని!

మనము పూజ చేయాలంటే, జపము చేయాలంటే, ధ్యానము చేయాలంటే - చేసేవాడు ఒకడు ఉండాలి, చేయబడేవాడు ఒకడు ఉండాలి, చేయుట అనే పని ఒకటి ఉండాలి. కాని నిజము ఒకటిగా ఉంటుందా - మూడుగా ఉంటుందా? ఆత్మ ఒకటిగా ఉందా - మూడుగా ఉందా? ఒకటిగా ఉన్న ఆత్మను మనము మూడుగా విభజిస్తే - అప్పుడు మనము ఆత్మకు చేరువౌతున్నామా - దూరమౌతున్నామా? మనము కాశీ వెళ్ళాలనుకొని కన్యాకుమారి వెళ్ళే రైలెక్కితే- కాశీ వెళ్ళగలమా? మన సాధనలు కూడ అలాగే ఉన్నాయి. ఆత్మను

తెలుసుకోవాలని మన ప్రయత్నము - కాని సాధనల పేరుతో మనము ఆత్మకు దూరమౌతున్నాము.

మనము పూజ చేస్తున్నాము - పూజ ఎవరు చేస్తున్నారు? - మన చేతులు చేస్తున్నాయి. మనము జపము చేస్తున్నాము - జపము ఎవరు చేస్తున్నారు? - మన నోరు చేస్తున్నది. మనము ధ్యానము చేస్తున్నాము - ధ్యానము ఎవరు చేస్తున్నారు? - మన మనస్సు చేస్తున్నది. చేతులు మనమా? - నోరు మనమా? - మనస్సు మనమా? శాస్త్రము మనము ఆత్మ అని చెబుతున్నదా? - 'చేతులు మీరని, నోరు మీరని, మనస్సు మీరని చెపుతున్నదా? "అందరూ గజీతగాళ్ళే - కాని ఒక్కడూ గజము కదలుటలేదు" - అన్నారు శ్రీ రమణ మహర్షి! మనము అందరము సాధనలు చేస్తున్నాము - కాని నిజము ఒక్కడికి తెలియుటలేదు. మరి మనము చేస్తున్న సాధనలే గనుక నిజమైతే - మనకు నిజము ఎందుకు తెలియుటలేదు? సాధనల పేరుతో మన గొప్పల్ని మనము అలంకరించుకుంటున్నాము - అందుకే మనకు నిజము తెలియుటలేదు. మనకు నిజము తెలియనప్పుడు - 'నేను ఇన్ని గంటలు పూజచేశాను, ఇన్ని గంటలు జపము చేశాను, ఇన్ని గంటలు ధ్యానము చేశాను' అని చెప్పుకుంటే ఏమిటి ప్రయోజనం? గానుగెద్దు అనుకుంటుందట - 'అబ్బబ్బ! ప్రొద్దుట నుంచి ఎంత దూరము నడిచానో' అని! తీరా రాత్రి గంతలు విప్పాక

ఎక్కడ ఉన్నది అక్కడనే ఉంటుందేట

మీరు కాని దేహాన్ని, మీరు కాని మనస్సును మీరు 'నేను' అని అనుకున్నంత కాలము - మీరు ఎన్ని జన్మలెత్తినా, ఎన్ని నదులలో మునిగినా, ఎన్ని యాత్రలు చేసినా, ఎన్ని శాస్త్రములు చదివినా, ఎన్ని సాధనలు చేసినా - మీకు నిజము తెలియదు - మాయ మీకు దారి యివ్వదు.

తడిగా ఉన్న చోటును పొడిగా చేయాలంటే - పొడిగుడ్డతో ఆ తడిని తుడిస్తే ఆ తడి ఆరిపోతుందా లేక ఆ తడి మీద మరిన్ని నీళ్ళుపోస్తే ఆ తడి ఆరిపోతుందా?

మన సాధనల లక్ష్యం ఏమిటి? - మనస్సును నిర్మూలించుట! కాని సాధన ఎవరు చేస్తున్నారు? - మనస్సే చేస్తున్నది! మనస్సుతో సాధనలు చేస్తూ - మనస్సును పెంచుకుంటూ - మనస్సును జయించగలమా? కోరికలను తీర్చుకుంటూ - కోరికలను జయించగలమా? అహంకారమును అలంకరించుకుంటూ - అహంకారమును జయించగలమా? - అది సాధ్యము కాదు.

## 7

మనస్సు యొక్క స్వరూపమును విచారణచేసి, దాని మూలమును శోధించే వరకు మనస్సు యొక్క విజృంభణ

ఆగదు. మనస్సు తన మూలమును చూసేవరకు మనస్సు నశించదు.

అన్ని తలంపులకు ఆధారము 'నేను' అను తలంపే! ఈ 'నేను' అను తలంపు ఆధారము లేకపోతే మిగిలిన తలంపుల యొక్క విజృంభణ ఆగిపోతుంది హృదయములో దాగి ఉన్న వాసనలు తమ విజృంభణకు ఈ 'నేను' ఎప్పుడు దొరుకుతుందా అని అవి కనిపెట్టుకొని ఉంటాయి.

ఒక కుక్క గేటు దగ్గరకు వచ్చినప్పుడు- దానిని మందలిస్తే అది వెనుతిరిగి వెళ్ళిపోతుంది - చూస్తూ ఊరకుంటే లోనికి ప్రవేశిస్తుంది. మరుసటిరోజు మరల రావటానికి ప్రయత్నిస్తుంది - మరల తరిమివేస్తే వెళ్ళిపోతుంది - తరువాత ఇక లాభము లేదనుకొని పూర్తిగా రావటము పూర్తిగా మానివేస్తుంది.

అదే విధముగా, మన ఈ 'నేను' లోకములోని గొడవలను నొల్లుకుంటూ, బాహ్యంగా తిరుగుతూ ఉంటే - మన వాసనలు ఒకదాని తరువాత ఒకటి విజృంభించి, తలంపుల రూపములో శిరస్సులో వచ్చి కూర్చుంటాయి - మనల్ని పిశాచములాగ పట్టి పీడిస్తాయి. వాసన తలంపుగా మారినదంటే మనస్సు మరింత బలపడుతుంది. వాసనను హృదయములోనే నిరోధించి ఉంచగలిగితే మనస్సు లొంగుతుంది గాని - వాసన

తలంపుగామారి శిరస్సులోనికి వచ్చిన తరువాత మనస్సును నిగ్రహించుట చాలా కష్టము.

విజృంభిస్తున్న మన మనస్సు అనే మదపుటేనుగునకు 'నేను ఎవడను?' అను విచారణ అంకుశము వంటిది. ఈ 'నేను ఎవడను?' అను ప్రశ్న అన్ని తలంపులను నాశనముచేసి, శవమును దహించు కొఱవి కట్టెవలె చివరికి ఈ'నేను' అను తలంపుకూడ కాలిపోయి రాలిపోతుంది.

మనకు కోరిక (తలంపు) కలిగిన వెంటనే - మనము దానిని చుట్టములాగ ఆదరించి, ఆ కోరికతో మనము కలిసిపోతే మన మనస్సు మరింత బలపడుతుంది. ఆ కోరికతో మనము కలిసిపోకుండా నిరోధిస్తే అది చిక్కిపోయి రాలిపోతుంది. కనుక మనకు కోరిక కలిగిన వెంటనే - "ఈ కోరిక ఎవరికి కలుగుచున్నది?" అని ప్రశ్నించుకుంటే - "నాకు" అని సమాధానము వస్తుంది. అప్పుడు మరల "కోరికవచ్చే నేనెవడను?" అని విచారణచేస్తే - అప్పటివరకు బాహ్యసుఖాలకోసం లోకాలవెంట తిరిగే మన మనస్సు ఒక్కసారిగా ఉక్కిరి బిక్కిరియై సమాధానము తెలియక తల్లక్రిందులై తనమూలమును శోధించుట మొదలుపెడుతుంది.

"నేను ఎవడను? పంచభూతములతో తయారైన ఈ దేహము నేనా? ఈ దేహమే గనుక నేనైతే ప్రాణము

పోయినతరువాత కూడ ఈ దేహము (శవము) "నేను ఉన్నాను" అని అనాలిగా? మరి ఏ శవమైనా అలా అంటున్నదా? దేహము జడము - దానికి మాటలాడేశక్తి లేదు. కనుక జడమైన దేహము నేనెట్లుకాగలను? దేహము నేనుగాకున్న మరి నేనెవడను?

"కర్మచేసే కర్మేంద్రియములు నేనా? లేక విషయములను గ్రహించు జ్ఞానేంద్రియములు నేనా? దేహమే నేను గానప్పుడు - మరి దేహములో భాగమైన ఈ ఇంద్రియములు నేనెట్లుకాగలను? ఇంద్రియములు నేనుగాకున్న మరి నేనెవడను?

"ప్రాణము నేనా? ప్రాణమే గనుగ నేనైతే - చివరిశ్వాస గాలిలో కలిసిపోయిన తరువాత కూడ 'నేను ఉన్నాను' అని నాకు తెలియాలి - కాని నా ఉనికి నాకు తెలియుటలేదు. నా అస్తిత్వము నాకు తెలియనప్పుడు - ఆ ప్రాణము నేనెట్లు కాగలను? ప్రాణము నేనుగాకున్న మరి నేనెవడను?

"మనస్సును నేనా? మనస్సే గనుక నేనైతే - అది మూడవస్తలు (జాగ్రత సుషుప్తి స్వప్నావస్తలు) లోను నిత్యము ఉండాలికదా? కాని గాఢనిద్ర(సుషుప్తి)లో మనస్సు ఉండుటలేదు. మరి గాఢనిద్రలో దాని అస్తిత్వాన్ని కోల్పోతున్న మనస్సును నేనెట్లు కాగలను? మనస్సును నేనుగాకున్న మరి నేనెవడను?

"అయితే గాఢనిద్రలో మనస్సు లేనప్పుడు నేనులేనా? మరి గాఢనిద్రలో గనుక నేనులేకపోతే - నిద్రనుంచి లేవగానే "నాకు సుఖముగా నిద్రపట్టినదని నేనెట్లు చెప్పగలుగుతున్నాను? గాఢ నిద్రలో కూడ నేను ఉన్నానుగాబట్టే, సుఖాన్ని అనుభవిస్తున్నానుగాబట్టే "నాకు సుఖముగా నిద్రపట్టినది" అని చెప్పగలుగుతున్నాను. మరి గాఢనిద్రలో సుఖముగావున్న ఆ "నేను" ఎవడను?"

ఆ నేనే నిజమైన "నేను"! అదే చైతన్యము! అదే బ్రహ్మము! అదే ఆత్మ!

ఆ నిజమైన "నేను" మన మెలుకువలోను, నిద్రలోను, స్వప్నములోను సమానముగానే ఉంది. కాని అది మన అనుభవములోనికి రాకుండా మన పరిమితబుద్ధే (దేహమే నేను అన్నభావనే) మనకు అడ్డుపడుతున్నది.

మనము ఎప్పుడైతే "నేనెవడను?" అని విచారణ మొదలుపెట్టామో - అప్పుడు మన దేహగతమైన "నేను" మనస్సునుంచి విడివడి, అంతర్ముఖమై, తన మూలమును శోధిస్తూ హృదయమువైపు ప్రయాణము చేస్తుంది. అప్పుడు మన మనస్సులోని కోరికలు విజృంభించుటకు ఆధారము లేక, అవకాశము చిక్కక, వాటివేగముతగ్గి, క్రమముగా చిక్కి, సన్నగిల్లి రాలిపోతాయి. కోరికల వేగము తగ్గినకొలది మన దేహగతమైన "నేను" హృదయములో

నిలకడగా ఉండగలుగుతుంది - దానికి ఆత్మరుచి అందుతుంది.

రూపాయి ఉన్నవాడిచేతికి వందరూపాయలు యిచ్చి, ఆ రూపాయిని క్రిందపారవేయమని అంటే ఎలా పారవేస్తాడో - అదే విధముగా భౌతికమైన క్షణిక సుఖాలను మరిగివున్న మన మనస్సు అభౌతికమైన ఆత్మ సుఖాన్ని ఎప్పుడైతే రుచి చూసినదో - వెంటనే మన మనస్సు ఆగిపోతుంది - ఆత్మలో అణిగిపోతుంది - తన ఉనికినే కోల్పోతుంది. అంత సముద్రములో లేచిన అలలు సముద్రములోనే అణిగిపోయినట్లు - మన దేహగతమైన నేను దాని మూలములో అణిగిపోయి - అహంవృత్తి నశించి, వెంటనే అంహాస్ఫురణ కలుగుతుంది - ఆత్మగతమైన "నేను" తానుగా వ్యక్తమౌతుంది. ఏ సుఖాలకోసమైతే భ్రమపడి మనము బాహ్యంగా పరుగెడుతున్నామో - ఆ సుఖమే మనమౌతాము!

'నన్ను తెలుసుకో అర్జునా, నన్ను తెలుసుకో అర్జునా' అని భగవద్గీతలో గీతాచార్యుడు చెప్పినా - 'నిన్ను నీవు తెలుసుకో, నిన్ను నీవు తెలుసుకో' అని రమణగీతలో రమణాచార్యుడు చెప్పినా ఈ ఆత్మగతమైన నిజమైన్న 'నేను'ను తెలుసుకోమనే చెప్పారు.

దేహపరిమితమైన మిధ్యానేను మన అనుభవములో ఉందిగాని - నిజమైన ఆత్మగతమైన 'నేను' మనలో

ఎందరికి అనుభవములో ఉంది? నిజ విచారణ చేస్తే నిజమైన 'నేను'తెలుస్తుంది - కాని మనము నిజ విచారణ చేస్తున్నామా - లేక నిజవిచారణ పేరుతో లోక విచారణ చేస్తున్నామా? మన ఈచిన్న 'నేను' పోతే మనము ఏమై పోతామోనని మనందరికి భయము. కాని గాఢనిద్రలో ఈ 'నేను' లేకుండానే మనము ఉండగలుగుతున్నాము కదా? మరి ఇప్పుడు ఈ 'నేను' పోతుందంటే మీరు ఎందుకు భయపడుతున్నారు? పరిమితమైన మీ చిన్న 'నేను' పోతే - అపరిమితమైన అసలు 'నేను' మీరౌతారు. మిమ్మల్ని దేహానికే పరిమితము చేసుకొని -మీకు (ఆత్మకు) మీరే అడ్డుగా ఉన్నారు. మిమ్మల్ని మీరు మింగితే - మీరెవరో మీకు తెలుస్తుంది - మీ స్వరూపము మీకు దర్శనమిస్తుంది - మాయ మిమ్ముల్ని విడిచిపెడుతుంది - మీరు దుఃఖములో నుంచి బయటబడతారు.

పిరికివాడు విచారణ పద్ధతికి పనికిరాడు. 'నేను ఎవడను?' అను విచారణ మహావ్రతము. హృదయములో పవిత్రత, ప్రవీణత, వినీతత, ఏకాగ్రత లేనివాడు ఆత్మవిచారణ చేయలేడు.

# 8

మనందరికీ సుఖము కావాలి. కాని ఆ సుఖము ఎక్కడ ఉందో తెలియక - దానికి'దేవుడు' అని ఒక అందమైన

పేరు పెట్టి 'దేవుణ్ణి తెలుసుకోవాలి, దేవుణ్ణి తెలుసుకోవాలి' అని అనుకుంటున్నాము. ఆ సుఖమే మీ స్వరూపమైనప్పుడు మీకు దేవునితో పనేముంది? మీరు దేనినైతే కోరుకుంటున్నారో, దేనికోసమైతే అశ్వీషిస్తున్నారో, ఈ లోకములోని విజ్ఞానమంతా దేనిని తెలుసుకోవాలని పరిణామ సిద్ధాంతములో పరుగెడుతున్నదో - అది మీరే! ఆ వస్తువు మీరే! ఆ బ్రహ్మము మీరే! దానినే లక్ష్యంగా పెట్టుకోండి! దానికోసమే జీవించండి! అవసరమైతే దాని కోసం మరణించండి!

ఆ బ్రహ్మమును తెలుసుకొనుటయే భారతీయ సంస్కృతి యొక్క లక్ష్యము. భారతీయ సంస్కృతి మానవ సంస్కృతికి వేరుగాలేదు.

మీరు జీవితములో ఆ బ్రహ్మానుభవమును పొందండి - ఇప్పుడే పొందండి! ఇక్కడే పొందండిఇప్పుడు పొందలేకపోతే కనీసము మీ ప్రాణము పోయేలోపునైనా పొందండి. అప్పుడు కూడ పొందలేకపోతే మీరు జీవితములో చాలా నష్టపోతారు. మీరు బ్రహ్మానుభవము పొందిన తరువాత తెలుస్తుంది - ఈ లోకము ఎంత అనిత్యమో, ఎంత అసుఖమో!

మనము ధనము లాభమనుకోవచ్చును, కీర్తి లాభమనుకోవచ్చును, అధికారము లాభమనుకోవచ్చును

- ఎవరి బుర్రలో ఉన్నదానిని బట్టి ఎవరి అంచనాలు వారు కట్టుకోవచ్చును. కాని ఆత్మకు మించిన లాభం ఉందా? మరి ఆత్మను తెలుసుకుంటేనే లాభమనే ఆలోచన మన జీవులలో ఎందరికి ఉంది?

మనము ఐశ్వర్యాలను, ఆరోగ్యాలను, అందమైన దేహాలను కోరుకుంటున్నాము గాని - అందమైన ఆలోచనలను మనలో ఎందరు కోరుకుంటున్నాము? ఆరోగ్యము చెడిపోతే కంగారుపడే జీవుడు ఉన్నాడు గాని - ఆత్మ తెలియలేదని బాధపడే జీవుడు ఉన్నాడా?

మనకు శని పట్టినదని ఎవరైనా చెపితే - ఆ శనిగ్రహం నుంచి బయట పడుటకోసము మనము పూజలు చేస్తున్నాము, జపాలు చేస్తున్నాము, దానాలు చేస్తున్నాము, ధ్యానాలు చేస్తున్నాము, హోమాలు చేస్తున్నాము - మరి జన్మల తరబడి మనల్ని పట్టి పీడిస్తున్న అజ్ఞానములోనుంచి బయటపడుట కోసము మనము ఏమి చేస్తున్నాము?

కేన్సర్ అంటే మనందరికి భయం! అందుకే కేన్సర్ వ్యాధిని ఎలా తగ్గించాలో రీసెర్చి చేయుట కోసము కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నారు - మంచిదే! కాని కేన్సర్ కంటే భయంకరమైన 'ఆశ' అనే గుణము మన అందరికి ఉంది కదా? మరి కేన్సర్ వ్యాధికోసం రీసెర్చి చేస్తున్న మీరు - ఈ 'ఆశ' అనేది మనిషికి ఎలా వచ్చినదో

తెలుసుకొనుట కోసము ఎందుకు ప్రయత్నించరు? ఆశేగదా మనల్ని బంధిస్తున్నది? ఆశేగదా మనకు దుఃఖాన్ని తీసుకువస్తున్నది? ఆశేగదా మనకు రోగాన్ని తీసుకువస్తున్నది? ఆశలేని జీవుడు ఉన్నాడా? మరి ఈ ఆశలోనుంచి బయటపడుట కోసము మీరు ఏమి చేస్తున్నారు?

తాత్కాలిక సుఖాల కోసము, తాత్కాలిక భోగాల కోసమ తాత్కాలిక ఉద్రేకాల కోసము - ఎంతో ధనాన్ని ఖర్చుపెడుతున్నారు, ఎంతో కాలాన్ని పాడుచేస్తున్నారు, ఎంతో శక్తిని వృధా చేస్తున్నారు - మరి ఆత్మను తెలుసుకొనుట కోసము మీరు ఏమి చేస్తున్నారు?

లోకాన్ని చూసి మురిసిపోయే భక్తులు ఉన్నారు గాని - దేవుణ్ణి చూసి మురిసిపోయే భక్తులు ఉన్నారా? నిత్య జీవితములో మనుష్యులతో రాజీపడుతున్న మీరు - దేవునితో రాజీపడలేరా? దేహము కోసము రాజీపడుతున్న మీరు - దేవుని కోసము రాజీపడలేరా?

సుఖ నిద్ర కోసము ఎన్నో సదుపాయాలు సమకూర్చుకుంటున్న మీరు ఆత్మను తెలుసుకొనుట కోసము ఏమీ సమకూర్చుకోరా? మీ బట్టకంటే మీ దేహము - మీ దేహము కంటే మీ మనస్సు - మీ మనస్సు కంటే మీ బుద్ధి - మీ బుద్ధికంటే మీ ఆత్మ ఎక్కువకాదా

నీటిలోనున్న వస్తువును బయటికి తీయుటకే - మీ శ్వాసను, నోటిని బంధించి, లోతులకు మునుగుతున్నారు కదా? మరి మన హృదయములో ప్రకాశిస్తున్న ఆత్మను తెలుసుకొనుట కోసము - మన మనస్సును, మాటను, చేతను, శ్వాసను, ఇంద్రియములను బంధించి, హృదయపు లోతులలోనికి మనము దిగనక్కరలేదా

మీరందరూ శాస్త్రములు పారాయణము చేస్తున్నారు - మంచిదే! మీరు పారాయణాలు చేయండి - కాని మీరు పారాయణాలు చేస్తే పాండిత్యము వస్తుంది గాని - ఆత్మ తెలియదు. ఆత్మ శాస్త్రములలో లేదు - మన హృదయములో ఉంది! హృదయములోనున్న ఆత్మను శాస్త్రములలో వెదకితే దొరుకుతుందా? ఆ భగవద్గీతలోనిదో, ఆ ఉపనిషత్తులలోనిదో, ఆ వేదాలలోనిదో ఏదో ఒక్క శ్లోకాన్ని తీసుకొని, అర్థము చేసుకొని, ఆచరించటానికి మీరు ఎందుకు ప్రయత్నించరు? మీరు ఆచరించటానికి ప్రయత్నిస్తే - అప్పుడు అజ్ఞానానికి, మీకు సంఘర్షణ ప్రారంభమౌతుంది. మీలోని అజ్ఞానము తగలబడటానికి కొంత కాలము పట్టినప్పటికీ - కనీసము అది అంటుకుంటుంది! కాని మనము ఆచరించము - పారాయణాలు చేస్తాము! పారాయణాలు ఎందుకు? పుణ్యాల కోసం! పుణ్యాలు ఎందుకు? ఇంకా మంచి భోగాల కోసం! మనము కోరుకొనేది భోగమా -

యోగమా?

హృదయములో ప్రత్యక్షముగానున్న ఆత్మ సుఖాన్ని విడిచిపెట్టి - మరణాంతరము ఎక్కడో స్వర్గములోనో, వైకుంఠములోనో సుఖముందని మీరు భ్రాంతి పడుతున్నారు. అందుకే యజ్ఞాలు చేస్తున్నారు - యాగాలు చేస్తున్నారు! పోనీ ఆ స్వర్గానికో, వైకుంఠానికో వెళితే మాత్రం అక్కడ ఎంతకాలము ఉంటారు మరల తిరిగి ఈ భూమి మీదకు రావలసినదేగా? మనము ఏ ఫైవ్‌స్టార్ హోటల్‌కో వెడితే - వాడు అక్కడ మనల్ని ఎంతకాలము ఉండనిస్తాడు? మన జేబులో ఉన్న డబ్బులు అయిపోయిన వెంటనే మనల్ని బయటకి తోలివేస్తాడు! 'నాకు ఇక్కడ చాలా సుఖంగా ఉందిఅని అంటే మాత్రము వాడు ఉండనిస్తాడా? అదే విధముగా మనము సంపాదించుకున్న పుణ్యము ఖర్చైపోగానే - ఈశ్వరుడు మనల్ని ఆ స్వర్గములో నుంచి మరల ఈ భూమి మీదకు విసిరివేస్తాడు. ఈ పుణ్యము - పాపము, సుఖము - దుఃఖము - ఈ ద్వంద్వాలు అన్నీ కూడ మనస్సు యొక్క పరిధిలోనివే మనస్సును దాటినవాడికి ఇవి ఏమిలేవు - ఉన్నది ఆత్మసుఖము ఒక్కటే

ఆ ఆత్మ సుఖాన్ని గనుక మనము పొందితే - ఆ దేవతలు కూడా మనల్ని చూసి అసూయపడతారు. జ్ఞాని అనుభవించే సుఖముతో పోలిస్తే - ఆ దేవతలు అనుభవించే సుఖము కోటవ వంతు కూడా ఉండదు. అదీ

జ్ఞానము యొక్క వైభవము.

'మీరు జ్ఞానాన్ని పొందండి. జ్ఞానముతో సమానమైనది ఈ లోకములో గాని, పరలోకములో గాని లేదు. ఎవడైతే జ్ఞానాన్ని పొందాడో - వాడు నాకు అత్యంత ప్రియుడు. వాడికి నా స్వరూపాన్ని ఇస్తాను. వాడికి - నాకు బేధము లేదు' అని గీతలో వాసు దేవస్వామి చెప్పాడు. కాని మనలో శుభాలు, సుఖాలు కోరుకునే భక్తులు ఉన్నారు గాని - జ్ఞానాన్ని కోరుకొనే భక్తులు ఉన్నారా? జ్ఞానములేని జన్మలు ఒకటిలేని సున్నలు! మనము చేసేది అంతా లోక చింతన, మనము చెప్పుకునేవి అన్నీ లోకం గొడవలు - మనము కోరుకునేవి అన్నీ క్షణికసుఖాలు - ఇంక మనకు జ్ఞానము ఏమిటి చెప్పండి?

మనము అజ్ఞానాన్ని విడిచిపెట్టకూడదు - మనకు జ్ఞానము రావాలి! అబద్ధాన్ని విడిచిపెట్టకూడదు - మనకు నిజము కావాలి! అహంకారాన్ని విడిచిపెట్టకూడదు - మనకు ఆత్మ తెలియాలి!

మరి నిత్య జీవితములో అజ్ఞానాన్ని తొలగించుకోకుండా - జ్ఞానాన్ని మనము ఎలా పొందగలం? ఆహంకారాన్ని త్యజించకుండా - నిరహంకారస్థితిని మనము ఎలా సాధించగలం? స్వార్థాన్ని విడిచిపెట్టకుండా - పరమార్థాన్ని మనము ఎలా అందుకోగలం!

మనము ఒక మొక్కను వేసి పెంచితే అది పెరిగి పెద్దదై కాయలు కాయకపోతే'వెధవ చెట్టు' అని బాధపడతాము కదా? మరి మనకు జన్మవచ్చినది కదా - ఈ జన్మకు జ్ఞానమనే పంట పండలేదని మనము బాధపడుతున్నామా?

మనమందరము 'దేవుడు ఉన్నాడు, దేవుడు ఉన్నాడు' అని అంటున్నాము. మనము నోటితో అంటున్న మాటే గనుక నిజమైతే 'నేను అందరి హృదయాలలో ఆత్మగా ప్రకాశిస్తున్నాను' అని గీతలో భగవంతుడు చెప్పినప్పటికి - రాళ్ళ మీద మనకున్న నమ్మకం మన గుండెలో వెలుగుతున్న ఆత్మ మీద ఎందుకు లేదు? మనము నోటితో 'దేవుడు ఉన్నాడు' అని చెపుతున్నాము - కాని హృదయములో మాత్రము 'దేవుడు లేడు - మనము ఉన్నాము' అని అనుకుంటున్నాము. అందుకే దేవుని మాటల మీద మనకు విశ్వాసము లేదు. ఈరోజు న్యూస్ పేపరు - రేపు వేస్ట్‌పేపరు. కాని భగవంతుడు చెప్పిన మాటలు అటువంటివి కావే - అవి త్రికాల సత్యాలే! కాని మనము న్యూస్ పేపరుకు యిచ్చే విలువను కూడ భగవంతుని మాటలకు ఇవ్వలేకపోతున్నామే - ఎందుచేత? దానికి కారణము ఒక్కటే - అది మన హృదయములో నున్న పాపము! హృదయములో పాపమున్న మనిషి మంచి మాటలు వినలేడు. దోషమున్న మనిషికి దేవుని మాటల మీద విశ్వాసము కుదరదు.

మనమందరము పాపమనే బురదలో కూరుకుపోయాము. ఈ బురదలోనుంచి బయటపడాలంటే - చేపలాగ మనస్సు అనే ప్రవాహానికి మనము ఎదురు ఈదాలి! ఎవరి మనస్సుకు వారు ఎదురీది - స్వార్థములో నుంచి, పాపములో నుంచి బయట పడాలి.

మన హృదయములో ప్రేమ లేకపోతే, మన హృదయములో క్షమ లేకపోతే, మన హృదయములో శాంతి లేకపోతే - మనము పాపముతో పోరాడలేము.

మరి మీరందరూ ప్రార్థనలు చేస్తున్నారుకదా? మీ ప్రార్థనలలో మీలోని లోపాలను తొలగించమని మీ యిష్ట దైవాన్ని మీరెప్పుడైనా ప్రార్థించారా? ఎందుచేతనంటే - మనలో లోపాలు ఉన్నంతకాలము దైవానుగ్రహము మనపైన వర్షించదు. వర్షము పడుతున్నప్పటికి బిందెను బోర్లాపెడితే - బిందె నిండుతుందా? అదే విధముగా దైవానుగ్రహము ఎప్పుడూ వుంది - కాని మనలోని దోషాల వలన, లోపాల వలన, పాపాల వలన అది మనలను తడుపుట లేదు.

'నీ యిష్టమే నా యిష్టము, నీ సంకల్పమే నా సంకల్పము' అని మనము దేవుడిని ప్రార్థించము - రెండు రూపాయలు పెట్టి ఒక కొబ్బరికాయకొట్టి 'నామాట ఏమిచేశావు?' అని దేవుడిని అడుగుతాము. ఇంతా చేస్తే మనము కొట్టేది ఒక కొబ్బరికాయ - మరల అందులో

సగము చెక్క మనదే ఆ మిగిలిన సగము చెక్కతో దేవుడు మన సమస్యలన్నీ పరిష్కరించి, మన పనులన్నీ పూర్తి చేయాలి. దీనినిబట్టి మన బుద్ధిలోని అల్పత్వము, స్వల్పత్వము మనకు తెలుస్తున్నది. ఇది వ్యాపారమా - భక్తా? ఈ వ్యాపార భక్తికే మనకు భగవంతుడు తెలియబడతాడా?

మనమందరము భక్తులమే! కాని మీ దేహాన్ని మీరు మరచిపోయి, మీ స్వార్థాన్ని మీరు మరచిపోయి, మీకులాన్ని మీరు మరచిపోయి - మీ మతాన్ని మీరు మరచిపోయి ఆ దేవుని దయ కోసమే మీ జీవితములో మీరెప్పుడైనా, ఏదైనా ఒక మంచిపని చేశారా?

## 9

స్వార్థాన్ని చంపుకోవటానికి ఏ జీవుడు ఇష్టపడడు. మనము స్వార్థమే పరమార్థము అనుకుంటున్నాము. కాని స్వార్థాన్ని చంపుకోకుండా దైవాన్ని దర్శించాలంటే అది సాధ్యము కాదు. స్వార్థము ఎక్కడలేదో దేవుడు అక్కడ ఉన్నాడు! మన అందరికి దేవుడు అక్కరలేదు కాని దేవుడు ఇచ్చే వరాలు మాత్రము కావాలి. అమృత స్థితిని సాధించుటకోసము కాదు మన సాధనలు - ఈ జీవితమును శాశ్వతము చేసుకొని చిరకాలము భోగాలను అనుభవించాలని! జన్మలు మారినా అనుభవిస్తున్న

భోగాలు పాతవేగా? నిరంతరము స్వార్థాన్ని చింతిస్తూ, అహంకారాన్ని అలంకరించికుంటున్న మనకు ఇంక గతి యేమిటి?

తన అహంకారాన్ని దేవుడికి ఆహారముగా అర్పించటానికి ఏ జీవుడు ఇష్టపడడు. అందరు తనను తాను అట్టేపెట్టుకొని - పావలా పెట్టి దేవుని దగ్గర పూలు పెట్టి, పళ్ళు పెట్టి మోక్షాన్ని పొందాలనుకునే వాళ్ళే! కాని దేవుడు దరిద్రుడు కాదు - ధనవంతుడే! మన ప్రలోభాలకు ఆయన మోసపోడు! ఆయన మనపళ్ళేంచేసుకుంటాడు, పూలేంచేసుకుంటాడు? ఏనాటికైనా మన అహంకారాన్ని ఆయనకు కానుకగా సమర్పిస్తే - మనల్ని తరింపచేయాలని ఆయన మన కోసము ఎదురు చూస్తున్నాడు.

మీరు లోక ప్రయోజనాల కోసము ఎదురు చూడకండి ఆ దేవుని దయకోసమే పనిచేయండి. మీరందరూ పువ్వులతో దేవుణ్ణి అలంకరిస్తున్నారు - మంచిదే! అదే విధముగా పనితోకూడా దేవుణ్ణి అలంకరించండి. మీకు ఏదిమంచిదో అది ఆయనే చేస్తాడు. మనకు అవసరములేని వస్తువులను మనము అడుగుట మానివేస్తే - మనకు అవసరమైన వస్తువులను ఆయనే మనకు తప్పక యిస్తాడు. మనల్ని గురించి మనము ఆలోచించుట మానివేస్తే - ఆయనే మనల్ని గురించి ఆలోచిస్తాడు. మనము ఒక్క అడుగు ఆయనవైపు వేస్తే- ఆయన పది

అడుగులు మన వైపు వేయుటకు ఎదురు చూస్తున్నాడు. ఒక్క అడుగైనా ఆయనవైపు వేయండి. మీరందరు పూజ గదులలో దేవునికి చోటు యిస్తున్నారు - కాని మీ హృదయాలలో కూడ ఆయనకు కొంచము చోటు ఇవ్వండి - కూర్చోటానికి.

అన్ని జన్మలలోకి మానవ జన్మ శ్రేష్ఠమైనది. మానవ జన్మ ఒక రైలు జంక్షను వంటిది. ఈ మానవజన్మలోనుంచే మనము ఊర్ధ్వ లోకాలకు వెళ్ళవచ్చు - అధోలోకాలకు వెళ్ళవచ్చు. ఈ మానవ జన్మలోనుంచే స్వర్గానికి వెళ్ళవచ్చు - నరకానికి వెళ్ళవచ్చు - మోక్షాన్నికూడ పొందవచ్చు! మానవ జన్మ రావటము, భగవంతునియందు భక్తి కలగడము, సత్పురుషుని సాన్నిధ్యము దొరకటము, మంచి మాటలు వినాలనే ఆశక్తి కలగటము ఎన్ని జన్మల పూర్వ పుణ్యఫలమో! మరణించే మన దేహము మరణించక ముందే - మన దేహములోనున్న మరణము లేని సత్య వస్తువును మనము తెలుసుకోవాలి.

ఆ సత్యాన్ని తెలుసుకోవటానికే ఈ మానవజన్మను మనకు ఒక అవకాశముగా పరమేశ్వరుడు ప్రసాదించాడు. ఈ అవకాశమును మనము సద్వినియోగము చేసుకోకపోతే మరల మానవ జన్మ వస్తుందో - రాదో చెప్పలేము. సత్య జ్ఞానము లేని జన్మ వ్యర్థము. సత్యాన్ని తెలుసుకొని మీ జన్మను సార్థకము చేసుకోండి!

# 10

ఈ లోకములో ఎంత బరువైన వస్తువైనప్పటికీ, ఎంత గొప్ప అదృష్టమైనప్పటికీ, ఎంత గొప్ప ఐశ్వర్యమైనప్పటికీ, ఎంతటి మహోన్నత పదవులైనప్పటికీ - ఈ కాల ప్రవాహములో కొట్టుకొని పోవలసినదే - ఒక్క ఆత్మ తప్ప కాలము ఈశ్వర స్వరూపము. అది హెచ్చుతగ్గులు లేకుండా ఎల్లప్పుడు ప్రవహిస్తూనే ఉంటుంది. మనకు తింటానికి అన్నము ఉందని, ఉంటానికి మేడలు ఉన్నాయని, పెట్టుకోటానికి నగలు ఉన్నాయని, చెప్పుకోవటానికి తాత ముత్తాతల గొప్పలు ఉన్నాయని - ఈ దేహం 'ఏమైనా వెయ్యేళ్ళు ఉంటుందనుకుంటున్నారా? అది సాధ్యము కాదు - అది సాధ్యము కాదు! మహా సామ్రాజ్యాలు, చక్రవర్తులే ఈ కాల గర్భంలో కలిసి పోయారు - మనమెంత? కాలముతో పోల్చినప్పుడు మన జీవితము ఏపాటిది?

కాలాన్ని మనము గౌరవించాలి. మీ చేతులలోనున్న వర్తమాన కాలాన్ని విడిచిపెట్టి - గతించిన భూతకాలాన్ని నెమరు వేసుకుంటూనో, లేక రాబోయే భవిష్యత్తు కాలాన్ని గురించి కలలు కంటూనో కళ్ళముందున్న కాలాన్ని చంపివేయకండి. భూత భవిష్యత్తు కాలాలు కూడ ఒకనాటి వర్త మానకాలమే! భూతకాలమే ఈ వర్తమానములోని మన దుఃఖానికి కారణమని, ఈ వర్తమానమే భవిష్యత్తులో

మన బ్రతుకులకు బాట వేస్తుందని మీరు ఎప్పుడు తెలుసుకుంటారు? నిన్న గతించినది - రేపు ఇంకా పుట్టలేదు. వాటిని చింతిస్తూ మీ కాలాన్ని వృధాచేయకండి. వర్తమానకాలాన్ని సద్వినియోగము చేసుకుంటే - భూత భవిష్యత్తు కాలాలు వాటి జాగ్రత్త అవి పడతాయి.

## 11

కర్తృత్వము పెట్టుకొని మనిషి పని చేసినంతకాలము - ఆ పని వాసనగా మారుతుంది. ఆ వాసనలో నుంచి కోరిక పుడుతుంది. ఆ కోరిక వాడిచేత పని చేయిస్తుంది. పని చేస్తే ఫలితము వస్తుంది. ఆ ఫలితాన్ని వాడు అనుభవిస్తాడు. ఆ అనుభవములోనుంచి మరల వాసన పుడుతుంది - దానివలన ఆ కోరిక మరింత బలపడుతుంది - ఇదీ కర్మ సముద్రము. కర్తృత్వ బుద్ధి ఉన్నంతకాలము మానవుడు ఈ కర్మ సముద్రాన్ని దాటలేడు, చావు పుట్టుకల వలయములో నుంచి బయటపడలేడు - మనిషి వెంట నీడలాగ దుఃఖము వాడిని వెంటాడి తీరుతుంది.

'నేను దేహము లోపల ఉన్నాను, నాకు బయట లోకముంది, దేవుడు ఎక్కడో దూరాన ఉన్నాడు అని మనిషి భ్రాంతి పడుతున్నంత కాలము - వాడిని ఆశ విడిచిపెట్టదు. ఆశ ఉన్న మనిషి ఫలితాన్ని ఆశించకుండా

పని చేయలేడు. ఫలితాన్ని ఆశించి మనిషి పనిచేసినంత కాలము - ఆ పని వాసనగా(సంస్కారముగా మారుతుంది. ఆ వాసన బీజ రూపములో మరుజన్మకు హృదయములో దాగిఉంటుంది.

మన శరీరములో రక్తము, మాంసము, ఎముకలు మాత్రమే ఉన్నాయని మీరు అనుకోకండి - రాగద్వేషాలు పెట్టుకొని మనము చేసిన ప్రతీ పని సంస్కార రూపములో మన హృదయములో దాగి ఉన్నాయి. మన శరీరములో ఉన్న రక్తము, మాంసము, ఎముకలు స్మశానములోనే కాలిపోతాయి కాని - మన హృదయములో కాపురమున్న సంస్కారాలలో ఒక్క సంస్కారము కూడ స్మశానములో కాలదు. డాక్టర్లు చెప్పే హృదయము కట్టెలలోనే కాలిపోతుంది గాని - మన ఆధ్యాత్మిక హృదయము మాత్రము కట్టెలలో కాలదు.

చిత్రగుప్తుడు ఎక్కడో యమ లోకములో కూర్చుని మన చిట్టాలు వ్రాస్తున్నాడని అనుకోకండి - మనల్ని నడిపే డ్రైవరు (పరమేశ్వరుడు) మన హృదయములోనే ఉన్నాడు - చూస్తున్నాడు. వాడు ఏ వైకుంఠములోనో, కైలాసములోనో ఉంటే - మనము వాడి కంటపడకుండా తలుపులు బిగించుకోవచ్చును! కాని వాడు మనకు దూరాన్నలేడు - మన హృదయములోనే ఉన్నాడు. మన శరీరముకంటే, మన ఇంద్రియములకంటే, మన గుండెకంటే కూడ మనకు అత్యంత సమీపముగా

ఉన్నాడు - అన్నీ చూస్తున్నాడు. మనకు రెండే కళ్ళు కాని వాడికి అన్నీ కళ్ళే! మనము నిద్రపోతాము - కాని వాడు నిద్రపోడు - వాడు సర్వసాక్షి! మనము ఎంతో తెలివిగా సమాజానికి తెలియకుండా, ప్రభుత్వానికి తెలియకుండా అతి రహస్యంగా చేసిన పనులను కూడ వాడు చూస్తున్నాడు. వాటినన్నింటిని మన హృదయములోనే రికార్డు చేసి ఉంచుతాడు - ఏదో తెలియక చేశాడులే అని సరిపెట్టుకోడు - వాడు పరమ లోభికంటే కూడ లోభి- ఒక్క పనిని కూడ విడిటి పెట్టడువాటికన్నింటికి ఏదో ఒక రోజున ఏదోఒక జన్మలో మనము సమాధానము చెప్పేవరకు మనల్ని విడిచిపెట్టడు - ఈ జనన మరణ చక్రములోనుంచి మనల్ని బయటబడనివ్వడు.

జీవుడు స్వతంత్రుడు కాదు - పరతంత్రుడు. పరమేశ్వరుడు ఒక్కడు మాత్రమే స్వతంత్రుడు- సర్వ ప్రజ్ఞావంతుడు. ఈ సృష్టికి అతడే కర్త - సర్వ నియంత! ఆయన్ని ప్రశ్నించే హక్కు మనకు లేదు. మనము చేసిన కర్మలను బట్టి మనల్ని తోలు బొమ్మలవలె ఆడిస్తున్నాడు. దేహ ప్రారబ్ధాన్ని ఏ జీవుడూ తప్పించుకోలేడు. జరుగవలసినది జరిగే తీరుతుంది - జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నము చేసినా జరుగనే జరుగదు.

ప్రతీ మనిషి జీవితముకూడ రిలీజు (విడుదల) అయిన ఒక సినిమా లాంటిది! సినిమాలోని సన్నివేశము ఏదైనా మనకు నచ్చకపోతే - ఆ సన్నివేశాన్ని మనము

ఆగిపొమ్మంటే మాత్రము అది ఆగిపోతుందా? ఆగదు! అది మన కంట్రోలులో లేదు. ఒక సన్నివేశము తరువాత మరో సన్నివేశము వస్తునే ఉంటుంది. అదే విధముగా పూర్వ జన్మలలో మనము చేసిన కర్మలనుబట్టి మనల్ని ఏ తల్లి గర్భములో ఎప్పుడు ఎక్కడ ప్రవేశపెట్టాలో- మనము ఈ భూమి మీద ఎప్పుడు ఎక్కడ పుట్టాలో- ఏ పని ఎప్పుడు ఎక్కడ ఎలా జరగాలో మన చివరి శ్వాసను ఎప్పుడు విడిచిపెట్టాలో అన్నీ నిర్ణయించిన తరువాతనే మనల్ని ఈ భూమి మీదకు పంపించాడు పరమేశ్వరుడు.

పరమేశ్వరుడికి మన మీద కక్షగాని, పక్షపాతముగాని లేదు - పక్షపాతము ఉంటే వాడు పరమేశ్వరుడెలా అవుతాడు? మనము చేసిన పనులే మనకు ఎదురు వస్తున్నాయి గాని - మన కర్మకు పరమేశ్వరుడు కర్తకాడు. ఈ జన్మలో మనకు ఏ తలంపులైతే కష్టాలను, నష్టాలను తీసుకువస్తున్నాయో - వాటిని పూర్వజన్మలలో మనము ఎంతో యిష్టముతోటి చేశాము. నాటి యిష్టము - నేటి అయిష్టము! అదే విధముగా ఈ జన్మలో మనకు ఎంతో యిష్టమైన కోరికులు కూడ భవిష్యత్తు జన్మలలో మనకు భారాలు కాక తప్పవు. నేటి యిష్టము రేపటి అయిష్టము కావటము సహజము - ఇది ప్రకృతి ధర్మము.

కష్టాలను కూడ యిష్టాలుగా ఎవరు స్వీకరించి సహిస్తారో - వారే ధన్యులు ఈ లోకంలో! మన

మనస్సులోని వంకర్లను కష్టాలు తీసినట్లుగా సుఖాలు తీయవు. పచ్చి కుండ కాల్చకుండా పనికి వస్తుందా? కనుక మీకు కష్టాలువస్తే అవి శాశ్వతము కాదనుకోండి - మీ మనస్సు కృంగిపోదు. అదే విధముగా మీకు సుఖాలు వస్తే అవి కూడ శాశ్వతము కాదనుకోండి - మీ మనస్సు పొంగిపోదు. అదృష్టాన్ని స్వీకరించినట్లే - దురదృష్టాన్ని కూడ మనిషి స్వీకరించ గలగాలి - అదే యోగము! అప్పటి వరకు ఈ కర్మ చక్రములోనుంచి మానవుడు బయట పడలేడు.

మన చేతిలో కర్మ ఉంది - పరమేశ్వరుని చేతిలో కర్మ ఫలితముంది. మన చేతిలోనున్న కర్మను మనము శ్రద్ధగా ఆచరిస్తే - తన చేతిలోనున్న కర్మ ఫలితాన్ని పరమేశ్వరుడు మనకు తప్పక యిస్తాడు. భగవంతుడు ఫలితాన్ని ఆశించకుండా పని చేయమని చెప్పాడేగాని - ఫలితాన్ని యివ్వమని మాత్రము ఎక్కడా చెప్పలేదు మనము ఫలితాన్ని ఆశించలేదని ఫలితాన్నిచ్చుట పరమేశ్వరుడు మరచిపోతాడని మీరు బయపడకండి - తగిన సమయములో మన ఫలితాన్ని మనకే తప్పక యిచ్చివేస్తాడు - భగవంతుడు కృతఘ్నుడు కాడు ! కాని బుద్ధిలేని మానవుడు తన చేతిలోనున్న కర్మను ఆచరించకుండా - పరమేశ్వరుని చేతిలోనున్న కర్మ ఫలితము కోసము ఎదురు చూస్తుంటాడు.

కర్మ ఫలితము మన చేతికి అందనప్పుడు ఎంత

సంతోషము కలుగుతుందో - కర్మ చేసేటప్పుడు కూడ మనము అంత సంతోషముతోనే కర్మను ఆచరించాలి. అప్పుడు మన హృదయములో గూడు కట్టుకున్న వాసనలు పల్చబడి బ్రహ్మానుభవము పొందుటకు దారి దొరుకుతుంది. పనిని ద్వేషించినంత మాత్రాన మనిషి పని చేయకుండా తప్పించుకోలేడు. ఏ పనినైతే మనము ద్వేషిస్తామో - మరల అదేపని మరుజన్మలో కూడ మనకు ఎదురువస్తుంది. మనకు ఏదైనా ఋణము ఉంటే ఆ ఋణము తీరిస్తే బాకీ తీరిపోతుందా - లేక ఋణము తీర్చకుండా ఏ అరణ్యాలకో పారిపోతే మన ఋణము తీరిపోతుందా? ఏ కర్మ నిమిత్తము ఈ జన్మ వచ్చినదో - ఆ కర్మను ఫలితము కోసము నిరీక్షించకుండా ప్రీతితో ఆచరిస్తూ - జీవితము పొడుగునా జీవనదిలాగ ఎవడైతే ఓర్పుగా జీవిస్తాడో - వాడికి మాత్రమే ముక్తికి దారి దొరుకుతుంది - ఆనందానుభవము చేతికి అందుతుంది.

కొంతమంది అంటూఉంటారు - "మరణకాలమందు నన్ను స్మరించినా నేను మీకు మోక్షాన్ని యిస్తానని భగవద్గీతలో వాసుదేవస్వామి చెప్పాడుకదా - ఆ చివరి క్షణములో 'కృష్ణా' అంటే సరిపోయేదానికి - జీవితం పొడుగునా ఈ భక్తి గొడవ మాకెందుకు?" - అని! భగవంతుడు చెప్పినమాట వాస్తవమే! కాని జీవితాన్నంతా గాలికి విడిచిపెట్టేసి ఎప్పుడో ఏదో చేద్దామని మీరెవ్వరు భ్రమపడకండి! జీవితం పొడుగునా భగవంతుణ్ణి

విశ్వసించి సేవించేవాడే చివరి క్షణములో భగవంతుణ్ణి స్మరించగలడో - లేదో వాడి చేతులలో లేదు. అటువంటప్పుడు మనము స్మరించగలమా? అది సాధ్యముకాదు. జీవించి ఉండగానే ఎవడు తన మనస్సును, ఇంద్రియములను స్వాధీనములోనికి తెచ్చుకుంటాడో - వాడు ఒక్కడు మాత్రమే చివరి శ్వాసను విడిచిపెట్టేటప్పుడు భగవంతుణ్ణి స్మరించగలడు గాని - జీవితాన్ని నిర్లక్ష్యంగా గడిపిన వాడికి అది సాధ్యముకాదు. జీవితము పొడుగునా మనము దేనికోసమైతే జీవించామో; దేనికోసమైతే మన కాలాన్ని ధనాన్ని శక్తిని యుక్తిని ఖర్చుపెట్టామో - మనము చివరి శ్వాసను విడిచిపెట్టేటప్పుడు ఆ బలమైన కోరికే వచ్చి మన శిరస్సును ఆక్రమించుకుంటుంది గాని భగవంతుడు మనకు జ్ఞాపకము రాడు. ఆ చివరి కోరికే మనకు రాబోయే జన్మను నిర్ణయిస్తుంది!

పశువును కట్రాడకు కట్టేసి కొట్టినట్లు - మనల్ని దేహ భావనకు కట్టేసి, ప్రారబ్ధమనే కఱ్ఱతో ప్రతీ జన్మలోను పరమేశ్వరుడు మనల్ని కొడుతూనే ఉన్నాడు. అయినా మన బుద్ధికి బుద్ధి రావటములేదు - మన తప్పును మనము సరిదిద్దుకొనుట లేదు - శిక్షను శిక్షణగా మనము స్వీకరించుటలేదు - అందుకే ఈ కర్మ సముద్రములోపడి మనము కొట్టుకొంటున్నాము. మరి మన బుద్ధికి బుద్ధి వచ్చేది ఇంకెప్పుడో?

# 12

మనిషికి ఉన్న స్వేచ్ఛ ఒక్కటే- తన వివేకాన్ని ఉపయోగించుకొని, వైరాగ్యాన్ని పెంచుకొని, మనస్సునుమ సంస్కరించుకొనే స్వేచ్ఛ ఒక్కటి మాత్రమే! భగవంతుడు మనకు కాళ్ళు యిచ్చాడు - నడుస్తున్నాం! చేతులు యిచ్చాడు - పని చేస్తున్నాం! కళ్ళు యిచ్చాడు - చూస్తున్నాం! నోరు యిచ్చాడు - తింటున్నాం! అలాగే మనకు బుద్ధిని కూడ యిచ్చాడు - ఎందుకు? ఆలోచించమని! మరి మనము ఆ బుద్ధికి పని చెప్పనప్పుడు ఆ బుద్ధి యొక్క ప్రయోజనమేమిటి?

మనము గుడులు కట్టమంటే కడతాం, యాత్రలు చేయమంటే వెళ్తాం, పూజలు చేయమంటే చేస్తాం - కాని నాలుగు మంచి మాటలు చెప్పి 'మీరు ఆలోచించండి' అని అంటే మాత్రము మనము ఆలోచించము. మన బుద్ధికి పని చెప్పడం మనకు యిష్టముండదు. మనమందరము ఎత్తువారి బిడ్డలుగానే పెరిగాము. మన బుద్ధికి సోమరితనము అలవాటు అయినది. అందుకే మనము స్వతంత్రముగా ఆలోచించే శక్తినికూడ కోల్పోయాము - బానిసలుగా మారిపోయాము.

దేహము పుడితే మనము పుట్టామనుకుంటున్నాము. దేహము పెరుగుతుంటే మనము పెరుగుతున్నామను

కుంటున్నాము. దేహము మరణిస్తేంటే మనము మరణిస్తున్నామను కుంటున్నాము. పుట్టటం, పెరగటం, చావటమే గొప్ప అనుకుంటే - మరి చెట్లు పుట్టటం లేదా, చెట్లు పెరగటం లేదా, చెట్లు చావటం లేదా? పెరగటానికి, చావటానికి - ప్రయత్నంతో పనేముంది, తెలివితో పనేముంది, సాధనతో పనేముంది? అది ప్రకృతి ధర్మం! మన ప్రయత్నములతో నిమిత్తము లేకుండానే దానిపని అది చేస్తుంది. మరి ప్రయత్నం దేనికి? సాధన దేనికి? -బంధములోనుంచి బయట పడటానికి! అదే తెలివియొక్క ప్రయోజనం! మరి మన బుద్ధికి పనిచెప్పనప్పుడు - మనకు, చెట్లకు తేడా ఏమిటి? మన జన్మకు అర్థం ఏమిటి?

మనందరికి తెలివితేటలు ఉన్నాయని అనుకుంటున్నాము - నిజమే! కాని మన తెలివితేటలు మంచికి ఉపయోగపడుతున్నాయా - చెడ్డకు ఉపయోగపడుతున్నాయా? మన తెలివితేటలతో ఆత్మను తెలుసుకుంటున్నామా - లోకాన్ని తెలుసు కుంటున్నామా? మనకు తెలివితేటలు ఎక్కడనుండి వస్తున్నాయో - ఆ వస్తువును తెలుసుకుంటేనే మన తెలివియొక్క ప్రయోజనం - అంతేగాని కొంపలు కూల్చటానికి కాదు!

మీ బుద్ధికి పని చెప్పండి - మీ వివేకానికి పదును పెట్టండి - మీ ప్రతిభను పెంచుకోండి. ఎవరైనా పెద్దలు

చెప్పిన మాటలు వినండి - తలుపులు మూసివేసుకోకండి. కాని మీ సొంత బుద్ధిని మాత్రము విడిచిపెట్టకండి. ఎవరో పీఠాధిపతి చెప్పాడనో, ప్రైమినిష్టరు చెప్పాడనో మీరు నమ్మవద్దు. ఎవరు ఏది ఎందుకు చెపుతున్నారో మీ బుద్ధితో ఆలోచించుకోండి - మంచి ఉంటే స్వీకరించండి - చెడును విడిచిపెట్టండి. బుద్ధిలో బానిసత్వము పనికిరాదు. సొంత ఆలోచన లేనివాడు స్వేచ్ఛా మండలములో ప్రవేశించలేడు.

# 13

ఆత్మ హేతువాదమునకు అతీతమైనది. అయినప్పటికీ అది సరళమైనదే - హేతువునకు విరుద్ధముగాలేదు. హేతువాదము కొంత దూరము వరకు మాత్రమే ప్రయాణము చేయగలదు. ఎందరో శాస్త్రవేత్తలు ఈ లోకమును శోధిస్తున్నారు గదా - వారికి ఈ లోకమును గురించి ఎంతవరకు తెలిసినది? లోకమును గురించే తెలుసుకోలేని మన హేతువాదము అలౌకికమైన ఆత్మను గురించి ఎలా తెలుసుకోగలదు? ఆలోచన బుద్ధి పరిధిలోనిది - ఆత్మ బుద్ధికి అతీతమైనది. ఎన్నో ప్రకృతి విషయాలను తెలుసుకుంటున్న మన బుద్ధి అలవాటు చొప్పున అభౌతికమైన ఆత్మను కూడా తెలుసుకుందామనుకుంటుంది - కాని పరిమిత బుద్ధికి

అనంతమైన ఆత్మ అందుతుందా? మనచేయి పట్కారును పట్టుకోగలదు గాని - పట్కారు మనచేతిని పట్టుకోగలదా?

ఆత్మ తెలియాలంటే రీజను ఎంతముఖ్యమో - విశ్వాసము కూడ అంతే ముఖ్యము. బ్రతుకుటకు అన్నము ఎంత ముఖ్యమో - ఆత్మను తెలుసుకొనుటకు విశ్వాసము కూడ అంతే ముఖ్యము. ఈశ్వరుని ఉనికిపట్ల విశ్వాసము లేని జీవుడు నశించిపోతాడు. నిరంతరము లోకచింతన, దేహచింతన ఉన్నవాడికి అఖండమైన ఆత్మ ఎలా అందుతుంది?

మన సైన్సు, టెక్నాలజీ ఎంతగానో అభివృద్ధి చెందినదని చెప్పుకుంటున్నాము - నిజమే! కాని, ఈ సైన్సుగాని, టెక్నాలజీగాని మానవ మానసములోనున్న ఒక్క బలహీనతను బయటికి తీయగలవా సైన్సు, టెక్నాలజీ మానవ దేహమునకు సౌఖ్యమును, భోగమును సమకూర్చగలవేగాని - స్వార్థమునుండిగాని, ప్రియమునుండిగాని, అప్రియము నుండిగాని మానవుడిని విడుదల చేయలేవు. ఆర్థిక అభివృద్ధికి అవి కొంతవరకు సహకరించినప్పటికీ - మానవ మానసము వికసించుటకు అవి దోహదపడలేవు. వాటి పరిమితిని మించి అవి పనిచేయలేవు. ఆత్మవిద్య ఒక్కటి మాత్రమే మానవుడిని పూర్ణ మానవుడిగా తీర్చిదిద్దగలదు.

# 14

మానవుడిని అజ్ఞానమునుంచి విడుదల చేయునదే నిజమైన విద్య - అదే ఆత్మవిద్య! అదే బ్రహ్మ విద్య! అదే రాజవిద్య! భుక్తికి భౌతిక విద్యలు ఎంత అవసరమో - మానసిక వికాసమునకు ఆత్మ విద్య కూడ అంతే అవసరము. ఆత్మ విద్యవలన మనస్సులోని అన్ని కోణములు వికసిస్తాయి. భుక్తిని, భక్తిని, ముక్తిని సాధించిపెట్టేది - ఆత్మవిద్య ఒక్కటి మాత్రమే మనము ఎన్ని విద్యలు నేర్చినప్పటికి ఆత్మవిద్య తెలియకపోతే - సంసార సముద్రాన్ని దాటలేము. ఒక్క ఆత్మవిద్యవల్ల మాత్రమే ఆత్మసుఖము అనుభవములోనికి వస్తుంది గాని - గారడీలవల్ల, మహిమలవల్ల ఆత్మ తెలియబడదు.

లోకములోని సహృదయులందరు ఆత్మవిద్యకు వారసులే! ఆత్మవిద్యను శ్రద్ధగా శ్రవణము చేయాలి. దారిద్రియముతో బాధపడుతున్న వాడికి భాగ్యము వచ్చి, ఆ దారిద్రియమును ఎలా ప్రక్కకు గెంటివేస్తుందో- అదే విధముగా ఆత్మవిద్యను శ్రద్ధగా శ్రవణము చేయగా చేయగా మనకు జ్ఞానము కలిగి, మనలోని అజ్ఞానమును సమూలముగా పెకలించి అవతల పారవేస్తుంది.

కాని నేటి సమాజములోనున్న దురదృష్టమేమిటంటే పూజలు చేయమంటే చేస్తారు, గుడులు కట్టమంటే

కడతారు, కొబ్బరికాయలు కొట్టమంటే కొడతారు, లక్షవత్తులు వెలిగించమంటే వెలిగిస్తారు - కాని శాస్త్రాన్ని శ్రవణము చేయమంటే చేయరు. ఒక రాయికిస్తున్న విలువను - ఒక అవతారపురుషుడికి యివ్వరు. ఒక రాయికిస్తున్న విలువను ఒక జ్ఞానికి యివ్వరు - ఇది మన దురదృష్టం.

దేశములో శాంతిభద్రతలను కాపాడుటకు పోలీసు బలగము ఎంత అవసరమో - మానవుల హృదయములను కాంతితో, శాంతితో నింపుటకు జ్ఞానుల బోధకూడా అంతే అవసరము. ఆకలి బాధను పోగొట్టే అన్నదాతకంటే - అజ్ఞానమునుపోగొట్టే జ్ఞానదాత శ్రేష్టుడు.

రాతి బొమ్మలో మాత్రమే దేవుణ్ణి చూసేవాడు - హృదయములో వెలుగుచున్న ఆత్మను చూడలేడు. అంతమాత్రముచేత విగ్రహారాధన తప్పనీ కాదు - రాతిబొమ్మలో దేవుడు లేడనీ కాదు. దేవుడు అంతటా ఉన్నాడు! అంతటా ఉన్న దేవుడు మన హృదయములో కూడ ప్రత్యక్షముగా ప్రకాశిస్తున్నాడు. ఆ విషయమే మనము మరచిపోయి - దేహమే మనమని అనుకుంటున్నాము. ఈ దేహబుద్ధి నుంచి మనల్ని బయిటికి తీయుటకే - దేవుణ్ణి రాతి బొమ్మకు పరిమితము చేసి చూపారు మన పెద్దలు. రాతి బొమ్మలో కూడ దేవుణ్ణి చూడగలిగితే - రాతి మనసులు కూడ బంగారు మనసులుగా మారతాయి.

మన మనస్సును సంస్కరించుకొనుటకు కర్మయోగము, భక్తియోగము, ధ్యానయోగము, జ్ఞానయోగము అని నాలుగు యోగములు చెప్పబడినవి మన శాస్త్రములో. ఎవడైతే ప్రతిఫలాన్ని ఆశించకుండా త్రికరణశుద్ధిగా కర్మను ఆచరించి, సమాజాన్ని సేవిస్తాడో - వాడికి భగవంతుని పట్ల భక్తి కలుగుతుంది. మనకున్న భక్తేగనుగ నిజమైతే భక్తి వలన కూడ ముక్తి వస్తుంది. భక్తి వలన భగవంతుని పట్ల ప్రీతి పెరిగి, మనస్సుకు ఏకాగ్రత కుదిరి ధ్యానము అలవడుతుంది. నిరంతరము ధ్యానము చేయగా చేయగా - మన మనస్సులోని మాలిన్యము తొలుగుతుంది - జ్ఞానము కలుగుతుంది. కర్మయోగము - ఫలితాన్ని ఆశించకుండా పనిచేయమని; భక్తియోగము - తనను భగవంతునిలో కలుపుకోమని; ధ్యానయోగము - ఇంద్రియములను నిగ్రహించి, ప్రాణశక్తిని పెంచుకొని, మనస్సును ఏకాగ్రపరచి, మనో మౌనాన్ని సాధించమని; జ్ఞానయోగము సత్యా సత్యములను వేరుచేయమని చెపుతున్నది.

మనస్సును అంతర్ముఖపరచి, దాని పుట్టుచోటైన హృదయ స్థానమందు నిరంతరం ఆత్మచింతనలో నిలిపిఉంచగలిగితే - అప్పుడు మీ మనస్సు ఆత్మాకారము చెందుతుంది - అదియే కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞాన యోగముల సారము' - అని అన్నారు భగవాన్ శ్రీ రమణ మహర్షి!

మానవుడిని పూర్ణ మానవుడిగా తీర్చి దిద్దుటకు ఎందరో మహాత్ములు ఎన్నెన్నో మార్గాలను మనకు బోధించారు. మార్గాలు వేరైనా చేరే గమ్యము మాత్రము ఒక్కటే! ఆ మార్గాలే మతాలుగా మారాయి. మతము అనేది ఒక అభిప్రాయము మాత్రమే. ఈ మతాలు పుట్టక ముందు కూడ ఆత్మ ఉంది. ఆత్మకు మించిన మతముగాని, కులముగాని, జాతిగాని, దేశముగాని లేనేలేవు.

మతాల గమ్యము పుణ్యము కాదు - మోక్షము. అహంకారము నుంచి, అజ్ఞానము నుంచి, అవిద్య నుంచి విడుదల పొందే వరకు ఏ మనిషికీ శాంతిలేదు - సుఖము లేదు. మనిషిని సంస్కరించి, మతిని బాగుచేసేదే మతము. మతి శుచి లేనివాడికి గతిలేదు. మతాలు పుట్టినది మానవులను వివేకవంతులుగా తయారు చేయుటకు గాని - మతము మత్తులో పెట్టి, ఆవేశాలను పెంచి, వివేకాన్ని చంపి - పదవుల కోసము, ప్రాబల్యాల కోసము మనుష్యులను బానిసలుగా మార్చి, దోచుకోవటానికి మతాలు పుట్టలేదు. మతము వలన మత్తు వస్తుంటే - అది మతము కాదు - మారణ హోమం! మనిషికి మనిషికి మధ్యన అగాధాలను సృష్టిస్తున్న ఈ మతాల అడ్డుగోడలను అధిగమించి, ఆత్మ సుఖాన్ని అందుకున్నవాడే నిజమైన తెలివిగలవాడు. ఈ నిజము మన బుద్ధికి అర్థమైతే - నేడు కులాల పేరుతో కుమ్ములాడుకుంటున్న ఈ కుటిల రాజకీయాలు

కూలిపోతాయి - మతాల పేరుతో జరుగుతున్న ఈ మారణహోమాలు ఆరిపోతాయి.

మీరెవరో మీకు తెలియచెప్పి, మీ స్వరూపాన్ని మీకు పట్టిచూపి, మోక్ష సుఖాన్ని మీ చేతికి అందించి, శాంతి శిఖరాలకు మిమ్ములను నడిపించి, ఆత్మ సింహాసనము మీద మిమ్ములను అధిష్ఠింపచేసేది నిజమైన మతము. మీరు మతాలను మార్చుకుంటే సుఖపడరు - మారుమనస్సుపొందండి - మనస్సును మార్చుకోండి - మీ మనస్సును బంగారము చేసుకోండి! మీరు ఏ మతములో ఉన్నప్పటికి - మీ మనస్సు యొక్క లోతును, వైశాల్యమును పెంచుకోకుండా - ఏమనిషి ప్రగతిని సాధించలేడు. హృదయములో ఒక్క దోషము ఉన్నప్పటికీ అది మీరెవరో మీరు తెలుసుకొనుటకు అడ్డుపడుతుంది.

పుణ్యబలము వలన, యోగ బలము వలన ఎవడి మనస్సు అయితే సంస్కరింపబడి, సూక్ష్మాతి సూక్ష్మమై, స్పటికవలె స్వచ్ఛముగా ఉంటుందో - వాడి మనస్సు మాత్రమే అంతర్ముఖమౌతుంది. మనస్సులో బలహీనతలు ఉన్నంతకాలము మనస్సు బహిర్ముఖమౌతూనే ఉంటుంది. అంతర్ముఖమైన మనస్సునకు మాత్రమే ఆత్మ తెలియబడుతుంది గాని - బహిర్ముఖమైన మనస్సునకు ఆత్మ తెలియబడదు. ఎంత కష్టమైనప్పటికి భోగ దృష్టినుండి మానవుడు తన మనస్సును వెనుకకు

మళ్ళించలేకపోతే - ఆత్మానందము లభ్యముకాదు.

మానసిక పరిధిలోనుంచి, భౌతిక పరిధిలోనుంచి బయటపడటానికి ఎవడైతే యిష్టపడడో - వాడు ఎన్ని జన్మలెత్తినా వాడికి ఆత్మ తెలియదు. విపరీతమైన ఆకలి వేస్తున్నప్పుడు ఆ ఆకలి బాధను తట్టుకోలేక అన్నము మీదకు మన మనస్సు ఎంత దూకుడుగా పరుగెడుతుందో - అంత తీవ్రంగా ఆత్మను తెలుసుకోవాలనే కాంక్ష, ఆ తపన, ఆ ఆధ్యాత్మిక ఆకలి ఎవడి హృదయములో నుంచి వెళ్ళుబికి వస్తుందో - వాడికి మాత్రమే ఆత్మ తెలియబడుతుంది. ఆకలి లేకుండా పది కూరలతో అన్నము పెడితే మాత్రము మీరు తినగలరా? ఎన్ని శాస్త్రములు ఎదురుగా ఉన్నా, ఎందరు గురువులు ఎదురుగా ఉన్నా ఏమిటి ప్రయోజనం - మీకు ఆధ్యాత్మిక ఆకలి లేనప్పుడు? ఆ తపన మీలో ఉందా? మీ గుండెను తడిమి చూసుకోండి!

## 15

మీరందరు ఒక దేవుని బొమ్మను ఎదురుగా పెట్టుకొని 'ఇది దేవుడు - ఇది దేవుడు' అని అనుకుంటున్నారు - అనుకోండి! కాని దేవుడే గనక ఆ రూపానికే పరిమితమైపోతే - వాడు దేవుడౌతాడా? ఆత్మ లేకుండా రాముడు ఉన్నాడా? ఆత్మ లేకుండా కృష్ణుడు

ఉన్నాడా? ఆత్మ లేకుండా అల్లా ఉన్నాడా? ఆత్మ లేకుండా ఏసు ఉన్నాడా? ఆత్మ లేకుండా మీరు పూజించే దేవతలెవరైనా ఉన్నారా? ఆత్మ లేకుండా ఏ దేవుడు లేడు! కాని ఏ దేవుడు లేకుండా ఆత్మ ఉండగలదు - అది స్వయం ప్రకాశం. అట్టి అఖండమైన చైతన్యాన్ని మనము 'ఇది - అది', అని ఎప్పుడైతే విభజించామో - అప్పుడే ఆ వస్తువు మనకు దూరమైపోయింది.

మనము పుట్టినది మొదలు బాహ్యంగా చూడటానికే అలవాటు పడ్డాము - మనకు ఎంతసేపు చర్మదృష్టే! చెప్పులు కుట్టేవారే ఛండాలురుకాదు - చర్మ దృష్టి ఉన్న ప్రతీవాడు ఛండాలుడే!

రూపదృష్టికి అలవాటుపడిన మనకు నిజము తెలియచెప్పుటకు - ఆత్మ ఏదైనా ఒక దేహమును ధరించి ఈ భూమిమీద అవతరించ వచ్చును. కాని ఆ దేహము యిప్పుడు ఏది? ఆ దేహము నిజముకాదు - ఆత్మ నిజం! మీ దేహము మీరు కానప్పుడు - దేవుని దేహము మాత్రము దేవునిది ఎలా అవుతుంది? దేవుడైనా సరే దేహమంటూ ధరిస్తే - ఆ దేహముకూడ నశించి తీరుతుంది. కాలానికి లొంగనిది, కాలము మింగలేనిది - ఆత్మ ఒక్కటే సాక్షత్తుగావున్న ఆ సత్యవస్తువును ఎవడైతే సాక్షాత్కరించుకున్నాడో - వాడికి ఆ దేవుడే దిగివచ్చి ఎదుట నిలిచినా కనీసము కన్నెత్తికూడా చూడాలనిపించదు - అట్టిది ఆత్మ!

అట్టి ఆత్మ మన హృదయములో నిరంతరము మన స్వరూపముగా స్వయముగా ప్రకాశిస్తుంటే - హృదయములోనున్న ఆ ఆత్మను విడిచి పెట్టి, దాని కోసము ఎంత కాలం ఇలా బయట వెదకుతారు? - ఎన్ని జన్మలు యిలా ఖర్చుపెడతారు? మన స్వరూపముగానున్న ఆత్మను దర్శించుటయే - దేవుని దర్శించుట! ఆత్మను దర్శించేవరకు మన స్వరూపముతోటి మనకు వియోగముతప్పదు. ఎంతకాలమైతే స్వరూపముతోటి వియోగముందో - అంతకాలము జన్మలు తప్పవు, దుఃఖము తప్పదు. తన స్వరూపము తనకు తెలియకుండా 'నేను దేవుణ్ణి చూశాను' అని ఎవరైనా చెపితే - అది నూటికి నూరుపాళ్ళు అసత్యము - అది నిజము కాదు. వాళ్ళు చూసిన ఆ దేవుడేగనుక నిజమైతే - వాళ్ళ అజ్ఞానము తొలిగిపోవాలి, దుఃఖము ఆరిపోవాలి. కాని 'నేను దేవుణ్ణి చూశాను' అని చెప్పే ఆ పెద్దమనిషి మరి దుఃఖములోనుంచి బయట పడ్డాడా? ఎంత గొప్ప డాక్టరు వైద్యము చేస్తే ఏమిటి ప్రయోజనం - మీ రోగము తగ్గనప్పుడు?

కంటికి కనిపించే దృశ్యము ఏనాటికైనా నశించి తీరుతుంది. దృశ్య విషయముల నుండి మనస్సును మళ్ళించి, హృదయములోనున్న ఆత్మతో అనుసంధానము చేస్తే - జీవలక్షణములు పోయి, మనము ఎవరుగా ఉన్నామో, మన స్వరూపము ఏమిటో మనకు

అవగాహన అవుతుంది - దైవముతో మనకు అభేదస్థితి కలుగుతుంది.

'దేవుడు ఉన్నాడా? ఉంటే మాకెందుకు కనిపించడు?' అని చాలామంది అడుగుతుంటారు. దేవుడు ఉంటే వీడికి కనిపించాలట! అయితే కరెంటు మన కళ్ళకు కనిపించుటలేదు - మరి కరెంటు లేనట్లేనా? మనము జన్మ జన్మలనుంచి ఈ చర్మచక్షువులతోటి బయిటికి చూడటానికే అలవాటు పడ్డాము. అందుకే మన కళ్ళకు కనిపించేవన్నీ నిజము - కనిపించనివన్నీ అబద్ధము - ఇదీ మన లాజిక్!

నీవు కళ్ళు మూసుకొని 'చీకటిగా ఉంది, చీకటిగా ఉంది' అని చిందులువేసినంత మాత్రాన ప్రకాశిస్తున్న సూర్యుడు లేనట్లేనా? నీవు ఒక్కసారి కళ్ళు తెరచి, సూర్యునివైపు ముఖము తిప్పితే తెలుస్తుంది - సూర్యుడు ఉన్నాడో - లేడో!

నీ అహంకారాన్ని నీవు మింగలేక, నీ మనస్సును నీవు చంపుకోలేక, నీ ఇంద్రియాలను నీవు నిగ్రహించుకోలేక - ఒక కులానికో, మతానికో, దేశానికో, పార్టీకో, పదవికో బానిసవైన నీవు - 'దేవుడు లేడు' అని అంటే ఇక దేవుడు లేనట్లేనా? బానిసలకు భగవంతుడు తెలియబడడు. ముందు నీవు బానిసత్వం నుంచి బయిటికిరా - అప్పుడు తెలుస్తుంది ఉన్న సత్యము ఏమిటో!

మీరు నమ్మినా - నమ్మకపోయినా, మీకు రుచించినా - రుచించకపోయినా, మీ బుద్ధికి అందినా - అందక పోయినా - ఈసృష్టిలో ప్రతీ జీవి ప్రతీరోజు గాఢనిద్రలో ఆ దేవుని ఒడిలోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు, శాంతిని అనుభవిస్తున్నాడు, సుఖ సముద్రములో మునిగి తేలుతున్నాడు.

'దేవుడు లేడు' అని చెప్పేవాడి హృదయములో కూడ ఆ దేవుడు ఉన్నాడు. వాడు'లేడని అంటున్నాడని' దేవుడు కోపగించుటలేదు, వాడి హృదయాన్ని విడిచిపెట్టి బయటికి వెళ్ళిపోవుట లేదు - సజీవముగా వాడి హృదయములో కూడ ప్రకాశిస్తూనే ఉన్నాడు. కాని బుద్ధిలేని మానవుడు ఆ దేవుడినే లేడని అంటున్నాడు! ఎంత మాయ?

ఉన్నదేదో - ఎప్పుడూ ఉంది. దానికి లేకపోవుట అంటూ లేదు. లేనిదేదో - అప్పుడూలేదు - ఇప్పుడూ లేదు. ఉన్నది ఉన్నట్లుగా మనకు తెలిసే వరకు - లేనిది ఉన్నట్లుగా కనిపిస్తుంది. అబద్ధము నిజముగా - నిజము అబద్ధముగా అనిపిస్తుంది.

## 16

మనము అనుకుంటున్న ప్రతీది నిజముకాదు - కాని ఏదో ఒక నిజము మాత్రము ఉంది. అందుకే మనము

నిజముకాని దానిని కూడ నిజమని భ్రమపడుతున్నాము. అసలు నిజమంటూ ఒకటి లేకపోతే - ఈ అబద్ధమంతా మనకు నిజముగా అనిపించదు. మరి ఏమిటానిజం?

ఆ నిజాన్ని తెలుసుకొనుటకే మనము ఈ భూమి మీదకు యాత్రకు వచ్చాము. కాని వచ్చిన పనిని మరచిపోయాము. మన మనస్సు సృష్టించిన ఈ సంత గొడవలోపడి - మన సొంతగొడవను విడిచిపెట్టాము. అయినప్పటికీ పరమేశ్వరుడు కరుణా స్వరూపుడుకాబట్టి, మన మీద ప్రేమతో - ఆ నిజాన్ని మనకు గుర్తుచేయుటకు - మనకు 'నిద్ర' అనే వరాన్ని యిచ్చాడు. ఆ నిద్ర నిత్యము మనకు రెండు పాఠాలను నేర్పుతూనే ఉంది - అయినప్పటికి మనము పాఠం నేర్చుకొనుటలేదు - ఆ నిజాన్ని గుర్తించుటలేదు.

ఈ భూమిమీద మనకు అత్యంత భయంకరమైనదేమిటి? - మరణము! మరణమంటే మనిషికి ఎందుకింత భయం? మరల భోగలను అనుభవించటానికి ఈ దేహము ఉండదేమోనని! కాని, ఎప్పుడో మరణముదాకా ఎందుకు - ప్రతీరోజు గాఢనిద్రలో మీదేహముతోటి మీరు విడిపోతునే ఉన్నారుగదా? - లోకముతోటి మీకు సంబంధము తెగిపోతూనే ఉందికదా? అప్పుడు మీరు పరుపుమీద పడుకున్నారో- నేలమీద పడుకున్నారోకూడ మీకు తెలియదే! అప్పుడు మీ కడుపునొప్పి బాధగాని -

గుండెనొప్పి బాధగాని మీకు తెలుస్తున్నదా! అప్పుడు మీ దేశం గొడవగాని, జాతి గొడపగాని, కులం గొడవగాని, రంగు గొడవగాని, సెక్సు గొడవగాని మీకు ఉందా? అప్పుడు మీ రాముడుగాని, రమణుడుగాని, అల్లాగాని, యేసుగాని- మీరు పూజించే దేవతలెవరైనా ఉన్నారా? మీ మనస్సు కల్పించినవి ఏమీలేవు! మీరు ఎంతగానో ప్రేమిస్తున్న మీ దేహం గొడవే మీకు లేదు! మీ దేహం గొడవ మీకు లేనప్పుడు - ఈ లోకం గొడవ మీకు ఎక్కడ ఉంది లోకం గొడవ లేనప్పుడు మీకు దేవుని గొడవ మాత్రం. ఎక్కడ ఉంది మెలుకువ వచ్చిన తరువాత - లోకాన్ని చూసిన తరువాత - 'ఈ లోకాన్ని సృష్టించినవాడు ఒకడు ఉండాలి' అని అప్పుడు దేవుని గొడవ మీకు గుర్తుకు వస్తున్నదిగాని - లోకము లేనప్పుడు మీకు దేవుని గొడవ కూడ లేదు - కాని మీరు మాత్రము ఉన్నారు! ఎలా ఉన్నారు? సుఖముగా. ఉన్నారు! మీరు సుఖముగా ఉన్నారు కాబట్టే - 'నాకు రాత్రి ఎంతో సుఖముగా నిద్ర పట్టినది' అని మెలుకువ రాగానే చెపుతున్నారు.

మీ ఇంద్రియాలు యివ్వలేని సుఖం, మీ మనస్సు యివ్వలేని సుఖం, మీ సంపదలు యివ్వలేని సుఖం, మీ చదువులు యివ్వలేని సుఖం, మీ గొప్పలు యివ్వలేని సుఖం, మీ పదవులు యివ్వలేని సుఖం - నిద్రలో ఏదో మనకు తెలియని సుఖం ఉంది! అందుకే ప్రతీజీవి నిద్రను

కోరుకుంటున్నాడు. ఒకవేళ నిద్ర పట్టకపోతే నిద్ర బిళ్ళలు కూడ మింగుతున్నాడు - సుఖ నిద్ర కోసం! ఇది నిజమా - అబద్ధమా?

నిద్రలో మీ దేహముతోటి మీరు విడిపోతున్నప్పటికి మీకు నిద్రంటే భయము వేయుటలేదు - కాని మరణమంటే మాత్రము భయపడుతున్నారు - ఎందుచేత? నిద్రలేవగానే - మీదేహము, మీ సంసారము, మీ సంపదలు మీకు కనిపిస్తున్నాయి - ఇది మీ అనుభవములో ఉంది! అందుకే నిద్రంటే మీరు భయపడుటలేదు. కాని నిజానికి నిద్ర ఎటువంటిదో - మరణము కూడ అటువంటిదే!మరణము వలన దేహాలు మారతాయి, పరిసరాలు మారతాయేతప్ప మీరేమి మారరు - మరల మీకు దేహము రాదేమోనని భయపడకండి! లోకముమీద మీకు మోహము ఉన్నంత కాలము మీకు దేహము వచ్చి తీరుతుంది! కనుక అనుభవించటానికి అవకాశం ఉండదేమోనని ఎవరు భయపడకండి - మీకు భోగదృష్టి ఉన్నంతకాలము ఈ లోకము మీకోసము ఎదురు చూస్తూనే ఉంటుంది! కాని పరిణామములో భోగి రోగౌతాడు - యోగి జ్ఞానౌతాడు! మరి మీరు కోరుకునేది భోగమా - యోగమా? ప్రశాంతముగా ఆలోచించుకోండి!

ఈ సృష్టిలో ప్రతీ జీవికి సుఖము కావాలి. మీకు సుఖం కావాలి - నాకూ సుఖం కావాలి. మనందరికి సుఖం

కావాలి! కాని ఆ సుఖం ఎక్కడ ఉందో తెలియక మనకు లేనిదానిలో సుఖముందని భ్రాంతి పడుతుంటాము. నిజానికి ఇహములో సుఖము ఎక్కడా లేదు. మరి సుఖం ఎక్కడఉంది ఒక్క ఆత్మలోనే సుఖముంది ఆ ఆత్మ ఎక్కడో వైకుంఠములోనో, కైలాసములోనో మాత్రమే లేదు - అంతాటా ఉంది! అంతాటా ఉన్నదేదో - అది మన హృదయములో కూడ ఉంది, మన స్వరూపముగానే ఉంది.

ఉన్న సత్యం ఒక్కటే- అది ఆత్మ! జగజ్జీవేశ్వరులు కూడ అహంకారము యొక్క సృష్టిఅహంకారము ఉంటే అంతా ఉంది - అహంకారము పోతే ఏమీలేదు. గాఢనిద్రలో అహంకారము అణిగి ఉన్నప్పుడు - అక్కడ తెలుసుకునేవాడు లేడు - తెలియబడేది లేదు - కాని సాక్షి మాత్రమే ఉన్నది! ఆ సాక్షే ఆత్మ! ఉండుట, జ్ఞానము, ఆనందము దాని స్వరూపము. అట్టి ఆత్మ నిద్రలో ఉంది - మెలుకువలో ఉంది - స్వప్నములో ఉంది. ఈ మూడు అవస్థలు మన అనుభవములో ఉన్నవిగాని, - ఈ మూడు అవస్థలలోను సమముగా, ఏకముగా ఉంటున్న ఆత్మ మన అనుభవములో లేదు.

గాఢ నిద్రలో మనము ఏ సుఖాన్నైతే అయితే అనుభవిస్తున్నామో - ఆ సుఖము ఇప్పుడు జాగ్రదావస్తలో కూడ ఉంది, కాని అది మన అనుభవములో లేదు. ఆ సుఖము మన అనుభవములోనికి

రాకుండా మన అహంకారమనే మూత అడ్డుపడుతున్నది. పాత్రలో నిండా నీరు ఉన్నప్పటికి - పాత్రపైన మూత ఉంటే- పాత్రలో ఉన్న నీరు మనకళ్ళకు కనిపిస్తుందా? అదే విధముగా మన అహంకారమనే ఈ మూతను తొలిగిస్తే - మన హృదయములో నున్న ఆత్మ సుఖము మనకు వ్యక్తమౌతుంది. ఈ అహంకారమనే మూతను తొలగించుటయే మనము సాధనల పేరుతో చేయవలసిన పని- అంతేగాని ఆత్మను మనము కనిపెట్టనక్కరలేదు అది సిద్ధముగానే ఉంది. 'ఈ బిడ్డలు మొఖమును ఎప్పుడు నావైపు తిప్పుతారా' అని అది మనకోసము ఎదురు చూస్తున్నది.

గాఢ నిద్రలో మనమందరము సుఖముగా ఉన్నాము - కాని ఉన్నామనే సంగతి మనకు తెలియుటలేదు. తెలియక పోవుట అజ్ఞానము! జాగ్రదవస్థలో మనము ఉన్నామని మనకు తెలుస్తున్నది - కాని మనము సుఖముగా లేము. ఆ గాఢనిద్రలో నున్న సుఖాన్ని ఈ జాగ్రదవస్థలోనున్న ఎరుకను ఏక కాలములో మన అనుభవములోనికి తెచ్చుకోగలిగితే - అదే మోక్షం! అదే నిర్వాణము! అదే స్వర్గ రాజ్యము! అదే కైవల్యము.

మోక్షమనేది మనము ఏదో సాధిస్తే వచ్చేదికాదు. సాధిస్తే వచ్చేదే గనుక అయితే - మరల అది ఏదో ఒక రోజున జారిపోతుంది. మోక్షసుఖం అలా జారిపోయేదే గనుక అయితే - దాని కోసము మనము ప్రయత్నము

చేయుట వ్యర్థము. కాని మోక్షసుఖం అలా జారిపోయేది కాదు - మోక్షమునేది ఎప్పుడూ ఉంది! మనము మోక్షాన్ని కోరుకునేటప్పుడు కూడ మనము మోక్షములోనే ఉన్నాము. కాని మోక్షములో ఉన్నామనే సంగతి మనకు తెలియుటలేదు. మోక్షాన్ని కోరుకునేటప్పుడు కూడ మనము మోక్షములోనే ఉన్నామని తెలుసుకొనుటయే మన సాధనల యొక్క లక్ష్యము.

మోక్షమనేది ఎప్పుడో మరణానంతరము పొందేదికాదు - ఈ లోకములోనుండగా, ఈ దేహములోనుండగా - ఇప్పుడే, ఇక్కడే ఆలోచించి అర్థము చేసుకొని అనుభవములోనికి తెచ్చుకోవలసినదే మోక్షము. మనము జాగ్రదవస్థలో ఉండాలి - సృష్టికి అతీతముగా ఉండాలి! ప్రపంచములో ఉండికూడ నిష్ప్రపంచస్థితిని పొందాలి. అట్టి స్థితిని పొందుటకంటే మించినగతి యింకేమున్నది?

## 17

మనిషికి ఆవేశముకంటే - ఆలోచన చాలా ముఖ్యము ఆవేశము పాపము తెస్తుంది - ఆలోచన పుణ్యము తెస్తుంది. ఆవేశము అనర్థాలకు దారితీస్తుంది - అశాంతికి గురి

చేస్తుంది. శాంతి లేనివాడు పాపముతో పోరాడలేడు. మనిషి పాపదూరుడు కానంత కాలము భయము కౌగిలిలో నుంచి బయటపడలేడు. భయస్తుడికి ఆత్మ తెలియదు. పిరికివాడు మోక్ష సింహాసనాన్ని అధిష్టించలేడు.

సత్యాన్ని అంటిపెట్టుకొని, స్వచ్ఛమైన, న్యాయమైన మార్గములో నడుచుకుంటే - మన ఇంద్రియాలు మన స్వాధీనములోనికి వస్తాయి. ఇంద్రియ విలాసమును నిరోధించిన వాడే నిజమైన త్యాగి. ఇంద్రియ నిగ్రహము లేకుండా మనో నిగ్రహము సాధ్యముకాదు. విషయలోలుడు, చలపచిత్తుడు చావుచేతిలో ఓడిపోతాడు - ప్రకృతి కౌగిలిలో బంధీగానే ఉండి పోతాడు.

ప్రకృతి ప్రలోభాలకు మనిషి లొంగిపోతున్నంత కాలము వాడు ప్రతిభావంతుడు కాలేడు. సత్యాన్వేషణకు ప్రతిభ అత్యంత ముఖ్యము. స్వరూపము సూక్ష్మ బుద్ధికి అందుతుంది గాని - స్థూల బుద్ధికి అందదు. ప్రతిభావంతులు, శ్రమ జీవులే దేశానికి నిజమైన సంపద. ప్రేమతో పనిచేస్తే ప్రతిభ పెరుగుతుంది. ప్రతిభ లేకపోతే ప్రగతి ఆగిపోతుంది.

సుద్గుణాలే మనిషికి నిజమైన సంపద. సద్గుణాలు ఉన్న మనిషి బంధములోనుంచి, సంసార సముద్రములో నుంచి, జనన మరణ చక్రములోనుంచి, అజ్ఞానమనే సుడిగుండములోనుంచి బయటపడతాడు - దుఃఖానికి

దూరమౌతాడు - శాంతి అనే రేవును చేరుకుంటాడు. గుణవంతుల బ్రతుకులే భవిష్యత్తులో ఉజ్వలముగా ప్రకాశిస్తాయి - శాంతికి, సుఖానికి వారే వారసులు. గుణహీనుల బ్రతుకులు భవిష్యత్తులో చితికిపోతాయి.

ఒక మనిషి మరొక మనిషిని కర్రలు పెట్టి కొట్టుకుంటే కత్తులు పెట్టి నరుక్కుంటే, తుపాకులు పెట్టి కాల్చుకుంటే, వీధులలో ఆందోళనలు చేస్తే - అది విప్లవమన్లో ఏదో అంటున్నారు. కాని అది విప్లవము కాదు. మీ మనస్సును మీరు సంస్కరించుకొంటే - అదే నిజమైన విప్లవం! ఇంతకు మించిన విప్లవం లేనేలేదు - లేదు - లేదు.

ప్రతీవాడు లోకాన్ని ఉద్దరించాలని అనేవాడే - అసలు ఈ లోకము 'నన్ను ఉద్దరించవయ్యా' అని మిమ్మల్ని ఎప్పుడైనా అడిగినదా? మరి అడగనిదానికి లోకము గొడవ మీకెందుకు? మీ గొడవేదో మీరు చూసుకోరా? మీరు పుట్టక ముందు ఈ లోకముంది, మీరు పోయిన తరువాత కూడ ఈ లోకముంటుంది. మరి మీరు పుట్టక ముందు ఈ లోకాన్ని ఎవరు ఉద్ధరించారు? మీరు పోయిన తరువాత ఈ లోకాన్ని ఎవరు ఉద్ధరిస్తారు? మృత్యువు వచ్చి మీ మీద పడబోతున్నదే - మీ తలంపులు మీ స్వాధీనములో లేవే - మీ యింద్రియములు మీ స్వాధీనములో లేవే - మీ మనస్సు మీ స్వాధీనములో లేదే - మరి మిమ్మల్ని మీర్హు

ఉద్ధరించుకోరా? తింటానికి మెతుకులు లేనివాడు అన్నసత్తరువు పెడతానన్నాడట! మీరు అశాంతితో కాలిపోతూ, దుఃఖముతో కుమిలిపోతూ - లోకానికి శాంతిని, సుఖాన్ని మీరు పంచగలరా? కనుక సంస్కరణను మీతోనే ప్రారంభించండి. మిమ్మల్ని మీరు సంస్కరించుకోనకుండా సాటి మానవుణ్ణి మీరు సంస్కరించలేరు. మీరు ఎంతవరకు పవిత్రులో అంతవరకే మీరు సమాజానికి ఉపయోగపడతారు. మీ శరీరమును శిక్షించి శరీరమును స్వాధీనము చేసుకోవాలి. మాటను నియమించి మాటను స్వాధీనము చేసుకోవాలి. మనస్సును నిగ్రహించి మనస్సును స్వాధీనము చేసుకోవాలి - అదే తపస్సు! మనస్సు, మాట, చేత - ఇవి మూడు ఒకటిగా ఉంటే - వాడి మనస్సు పరిశుద్ధమౌతుంది - వాడికి పరమాత్మ దర్శనమిస్తాడు. మనస్సుతో గాని. మాటతో గాని, దేహముతో గాని మనము ఎవ్వరినీ హింసపెట్టకూడదు. ఎదుటి వారిని హింసపెట్టామా - భవిష్యత్తులో మనము హింసకు గురి అవుతాము. మనము ఎదటివారికి ఉపకారము చేస్తే - ఉపకారము, అపకారము చేస్తే - అపకారము రాబోయే జన్మలలో మనకు ఎదురువస్తాయి. మంచిచేసిన వాడికి సద్గతి - చెడు చేసిన వాడికి దుర్గతి తప్పదు. సాటి ప్రాణుల పట్ల మీరు దయ చూపిస్తే - మీ పట్ల దేవుడు దయ చూపిస్తాడు. దయ దైవీ గుణము. దయగల హృదయాలే శాంతికి నిలయాలు - దేవునికి ఆలయాలు.

ఏదైనా అర్హతను బట్టి వస్తుందిగాని - కోరికను బట్టిరాదు. అహంకారి సుగతిని కోరుకున్నా మిగిలేది దుర్గతి మాత్రమే. కోరికలను నిరోధించలేని మానవుడు యోగ మార్గము నుండి పతనమౌతాడు. దేహ బుద్ధిని త్యాగము చేయలేనివాడికి ఆత్మ బుద్ధి ఎలా కలుగుతుంది? అజ్ఞానమునే బీజమునకు జ్ఞానమనే పంట ఎలా పండుతుంది?

ఆత్మను విడిచిపెట్టి అహంకారమును ఆశ్రయిస్తే - అది పాలను విడిచిపెట్టి, పాలపైనున్న నురగను స్వీకరించుట వంటిది. అహంకారమును ఆశ్రయించి జీవించేవాడు - జీవితము పొడుగునా అజ్ఞానము చేతిలో బంధీగానే ఉండిపోతాడు. ఎవడైతే ఓర్పును స్వరూపముగా చేసుకుంటాడో - వాడు మాత్రమే అహంకార రహితుడౌతాడు. నిరహంకారి మాత్రమే నిర్వికారముగా ఉండగలుగుతాడు. వికారము లేనిదే యదార్థము. ఆ యదార్థమును గ్రహించే వరకు జడత్వము నుండి, భ్రాంతి నుండి, అసత్యము నుండి, ప్రకృతి నుండి మానవుడు విడువడలేడు.

చీకటిలో టార్చిలైటును ఏ విధముగా ఉపయోగించుకుంటామో - అదే విధముగా అజ్ఞానమనే చీకటిలోనుంచి బయటపడుట కోసము మీ వివేకమనే

దీపాన్ని వెలిగించుకోండి. కుక్క వచ్చి మీదపడి కరుస్తుంటే - చేతిలోనున్న కర్రను ఎలా అడ్డు పెట్టుకుంటామో - అదే విధముగా మీ బుద్ధిని ఉపయోగించుకొని, ఈ మాయలోనుంచి బయటపడండి. మీ బుద్ధికి ఉన్న సోమరితనాన్ని విడిచిపెట్టి - దానికి పదును పెట్టండి. ఈ నాటికైనా, ఏ నాటికైనా ఆలోచన లేనివాడు స్వతంత్రుడు కాలేడు. స్వతంత్రుడు కానివాడు సత్యమును తెలుసుకోలేడు. సాంప్రదాయముల కంటే సత్యము గొప్పది. ఆ సత్యము తెలియనంత కాలము - మీరు ఏ లోకములో ఏ దేహమును ధరించినప్పటికీ - ఏదో రూపములో దుఃఖము మిమ్మలను వెంటాడుతూనే ఉంటుంది.

స్వప్నములో సంచరించే స్వప్నదేహాలు ఎటువంటివో - మెలుకువలో సంచరిస్తున్న ఈ స్థూలదేహాలు కూడ అటువంటివే! స్వప్నము ఒక పొట్టి జీవితము - జీవితము ఒక పొడుగు స్వప్నం - అంతే తేడా! స్వప్నములో ఉన్నంతసేపు ఆ దేహము, ఆ జీవితమే నిజమనుకుంటాము - మెలుకువ వచ్చిన తరువాత తెలుస్తుంది - అదంతా స్వప్నమేనని! అదే విధముగా యిప్పుడు మనమందరము అజ్ఞానమనే నిద్రలో ఉన్నాము - అందుకే ఏ జన్మకాజన్మ ఈ దేహాలు, ఈ జీవితాలే నిజమనుకుంటున్నాము. మనకు జ్ఞానము కలిగిన తరువాత తెలుస్తుంది - ఇప్పటి వరకు మనము జీవించిన జీవితాలు అన్నీ మాయ జీవితాలనీ, స్వప్న

జీవితాలలాంటివేననీ!

దేహము తోటి, మనస్సు తోటి తాదాత్మ్యము లేనివాడికి విధి ఎన్ని కష్టములను, నష్టములను, బాధలను, భారాలను తీసుకు వచ్చినా - వాడు తన సహజ స్థితి నుండి జారడు. భోగాసక్తి ఉన్న వాడికి దేహముతోటి, మనస్సుతోటి పని వుందిగాని - భోగాసక్తి లేని వాడికి దేహముతోటి, మనస్సుతోటి పనేముంది? వాడికి శరీరము ఉన్నప్పటికీ - వాడు అశరీరుడే! అశరీరుడికి మరణమేమిటి?

ఈ దేహము ఎంత నిజమో, ఈ లోకము ఎంత నిజమో - ఆ దేవుడు కూడ అంతే నిజము.రోగమున్న వాడికి మందు - రోగమే లేనివాడికి మందుతో పనేముంది? అదేవిధముగా అహంకారమున్న వాడికి సాధన - అహంకారమే లేనివాడికి సాధనతో పనేముంది? అవిద్య ఉన్నవాడికి విద్య - అవిద్య లేనివాడికి విద్యతో పనేముంది? వియోగమున్నవాడికి యోగము - వియోగమే లేనివాడికి యోగముతో పనేముంది? బంధమున్న వాడికి మోక్షము - బంధమే లేనివాడికి మోక్షముతో పనేముంది? అట్టి బ్రాహ్మీస్థితిని పొందినవాడికి పోయేదేమిటి - వచ్చేదేమిటి? ఆలోచించండి! ఆలోచనే తపస్సు! ఆలోచనే అమృతం! అమృత స్థితిని పొందండి - అద్వైత శిఖరాలను అధిరోహించండి! ఆత్మ సింహాసనాన్ని అదిష్ఠించండి! శాంతి సామ్రాజ్యానికి చక్రవర్తులు కండి!

తత్వమసి!

# అరుణాచలం

**మనిషికి గుండె ఎటువంటిదో - ఈభూమండలానికి అరుణాచలం అటువంటిది.**

అరుణాచల స్మరణ పంచాక్షరీతో సమానము. స్మరణ మాత్రముననే అహంకారమును హరించు క్షేత్రమది. అరుణగిరి ప్రదక్షిణ పుణ్యప్రదము. అది కోరికలు నెరవేర్చు కొండ.

అరుణాచల క్షేత్రములో ఈశ్వరుడు మూడు రూపములలో ఉన్నాడు. 1. గిరిరూపము, 2. లింగరూపము, 3. రక్తమాంసములతో సశరీరుడై కొండపైన ఉత్తర దిక్కున ఒక మర్రిచెట్టుక్రింద 'అరుణగిరియోగి' రూపములో ఉన్నాడు.

పంచభూతముల కలయికే ప్రకృతి. ఈ పంచభూతములకు పంచ లింగములను ప్రతిష్ఠించినారు మన పెద్దలు. 1. అరుణాచలము - అగ్నిలింగము - ఇదే ఆదిలింగము. 2. జంబుకేశ్వరము - జలలింగము. 3. కాళహస్తి - వాయులింగము. 4. కంచి - పృథ్వీలింగము. 5. చిదంబరము - ఆకాశలింగము.

కాశీలో మరణిస్తే మోక్షం - తిరువయ్యూర్‌లో జన్మిస్తే మోక్షం! కాని ఆ చావు పుట్టుకలు రెండూ మనిషి చేతిలో లేవు. చిదంబరాన్ని దర్శిస్తే మోక్షం - దర్శించటానికి ధనం కావాలి! అరుణాచలాన్ని స్మరిస్తేనే చాలు - మోక్షం! స్మరించటానికి ఖర్చేముంది? కనీసం స్మరించలేరా?

"అరుణాచలాన్ని స్మరిస్తేనే మోక్షం వస్తుందా? మోక్షమంటే మరీ అంత తేలిగ్గా ఉందా?" అని ఒక పెద్దమనిషి భగవాన్ శ్రీ రమణమహర్షిని ప్రశ్నించాడు.

"ఔను! అరుణాచలాన్ని స్మరిస్తేనే చాలు - మోక్షం వచ్చితీరుతుంది. అది ఈశ్వరుని ఆజ్ఞ! ప్రశ్నించటానికి నీవెవరవు? అసలు నీవు ముందు స్మరించిచూడు! మోక్షం వస్తుందో లేదో నీకే తెలుస్తుంది" అన్నారు భగవాన్!

మీరూ అరుణాచలాన్ని ప్రేమించండి - ఆ అరుణాచలమే మీరౌతారు

RATNA PRINTING WORKS, PALAKOL. PH: 2946